www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 89  గురువారం, ఆగస్టు 13, 2026 , పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad






## మాజీరాష్ట్రపతి కోవింద్
# బయోగ్రఫీ

**- ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ ఆవిష్కరించిన మోడీ**

**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బయోగ్రఫీని ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. 'ట్రయం ఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తకాన్ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోవింద్‌తో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని మోదీ గుర్తుచేసుకున్నారు. రాష్ట్రపతిగా కోవింద్ అందించిన మార్గద ర్శకత్వం, తనపై చూపిన ఆప్యాయత, ఆత్మీయత తనకు ఎంతో విలువైనవని మిగతా2లో...

## డిఫాల్టర్ మిల్లర్ల నుంచి
# బకాయిల వసూళ్లు

**మిలర్ల బ్లాక్‌మెయిల్‌ను ఎట్టి పరిస్థితిలో సహించం**

**డిఫాలర్ల మిల్లులను మహిళలకు అప్పగించాలి**

**పౌరసరఫరాల శాఖ సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్,ఆగస్టు 12 :** సివిల్ సప్లయిస్ శాఖలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్ల నుంచి బకాయిలను వసూల్ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉద్దేశ పూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకొని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. బకాయిల వసూళ్లకు ఒక విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. కేబినెట్ సబ్‌కమిటీలో దీనిపైన చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. బకాయిల వసూళ్లే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని మార్గనిర్దేశంచేశారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని హెచ్చరించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మార్కెట్‌లో ఉన్న గోదాములను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశిరచారు.

మిగతా2లో...



## నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**వాటాల్లో బిఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం**

**అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కెటిఆర్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఆగస్టు 12 :** తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో

మిగతా2లో...

## తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**- ఇళ్ల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వండి**

**- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు పొంగులేటి వినతి**





## చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ
# సమాధానమిస్తా: అమిత్‌షా



**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం

మిగతా2లో...




## ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**- గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీ నియామకం**

**- ప్రాజెక్టుల పరిహారం.. పునరావాసం వేగవంతం**


**- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం..నీటి పారుదల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**మేం టి హబ్‌ను తెస్తే..**

**వారు అనుముల హబ్స్‌తో దోపిడీ**

**మరోమారు ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,ఆగస్టు 12 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతు న్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్‌లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్‌ను 'ను నిర్మిస్తే... మిగతా2లో...

## టాటా సన్స్ చైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

**- ఆరు నెలల ముందే తప్పకున్న చంద్రశేఖరన్**



**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** టాటా సన్స్ చైర్మన్ పదవికి ఎన్ చంద్రశేఖరన్ రాజీనామా చేశారు. ఈ సంస్థ చైర్మన్ పదవిని తాను మరోసారి కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆ సంస్థ సర్వసభ్య సమావేశం జరగనుంది. అందుకు కొద్ది రోజుల ముందు చంద్రశేఖరన్

మిగతా2లో...

## జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

**- పడవ బోల్తాపడి 44 మంది దుర్మరణం**



**హరారే:ఆగస్టు 12 :** జింబాబ్వేలోని కరీబా సరస్సులో ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న పడవ ఒక్కసారిగా బోల్తా పడటంతో సుమారు 44 మంది మృతి చెందారు. పలువురి జాడ గల్లంతైంది. 67 మందిని సహాయక సిబ్బంది కాపాడింది.

మిగతా2లో...

# చర్చకు నేను సిద్ధం.. అన్ని ప్రశ్నలకూ సమాధానమిస్తా: అమిత్‌షా

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో 'కనిపించడం లేదు', 'పారిపోయారు' వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కౌంటర్ ఇచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ప్రశ్నల వర్షం కురిపించారు. 'విద్యార్థులపై లాఠీచార్జ్ ఎవరు చేశారు. కాల్పులకు ఆదేశించింది ఎవరు?. 20 రోజులుగా అమిత్‌షా ఎందుకు మాట్లాడలేదు. పార్లమెంట్ ముగిసే సమయానికి అమిత్‌షా డ్రామాలు ఆడుతున్నారు' అంటూ రాహుల్ మండిపడ్డారు.

# నీటివాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. నీటీ వాటాపై బలంగా కొట్లాడుతామని పేర్కొన్నారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. తాము కోటిన్నర రూపాయిలకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. 5 ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ. 200 కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలను భయపెట్టడం కేటీఆర్‌కు మంచిది కాదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి హితవు పలికారు. రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని, తమ ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎకరా కోటిన్నర లెక్కన కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పిన శ్రీధర్‌బాబు.. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించొద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని.. పారిశ్రామికవేత్త లను భయపెట్టడం, తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు. నీటి వాటాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని మంత్రి స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తమపై ఉన్న కోపాన్ని తెలంగాణ ప్రజలపై చూపవద్దని ఆయనకు సూచించారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మలేద పేర్కొన్నారు. అందుకే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించారని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

# తెలంగాణ పేదలకు ఇళ్ల సౌకర్యం పెంచండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 12 :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద తెలంగాణ రాష్ట్రానికి సమగ్ర ప్రాతిపదికన ఒకేసారి 11,56,915 ఇళ్లను కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను పొంగులేటి కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి . రేవంత్‌రెడ్డి రాసిన లేఖను ఈ సందర్భంగా పొంగులేటి గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ ఉందని తెలిపారు. ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. కేంద్ర వాటా, సాధారణ రాష్ట్ర వాటాతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బ్జడెట్‌లో కేటాయించినట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాలని పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి ఖఓంజ-ఉ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని చెప్పుకొచ్చారు.

అది చరిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్?2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని మంత్రి పొంగులేటి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. వీటికి సంబంధించి సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలన్నీ ఏడాది క్రితమే పూర్తయినప్పటికీ, కేంద్రం నుంచి లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందన్నారు.

తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోయి తీవ్రమైన డిమాండ్ పేరుకుపోయినందున, ఒకేసారి ఈ ఇళ్లన్నింటినీ మంజూరు చేయాలని కోరారు. ఇకపోతే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే, తెలంగాణలోని గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని, అది చారిత్రాత్మక ఘట్టంగా మారుతుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ తదితరులు ఉన్నారు.

# ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

**హైదరాబాద్,ఆగస్టు 12 :** జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు.

గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా సాధ్యమైనంత వరకు ఎత్తి పోసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలన్నారు.

రాష్ట్రంలో చివరి దశలో ఉన్న పలు ప్రాజెక్టుల కింద కొన్ని గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలకు పరిహారం చెల్లింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు వాస్తవ పరిస్థితి, పరిహారం, పునరావాసానికి సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సేకరించాల్సిన భూమి, పరిహారం, ఇతర అంశాలపై నివేదిక రూపొందించాలన్నారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ ను నియమించాలని ఆదేశించారు.

కన్సల్టెంట్ నియామకంలో నైపుణ్యం, గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఆయకట్టు కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి కోవింద్ బయోగ్రఫీ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక దిశలో రామ్‌నాథ్ గొప్ప కృషి చేశారని, ఆయన చేసిన సూచనలు దేశాన్ని కొత్త దిశలో నడిపించనున్నాయని తెలిపారు. 'నాకు కోవింద్ చాలా కాలంగా తెలుసు. ఆయన సామర్థ్యాలను నేను సుదీర్ఘకాలంగా తెలుసుకునే అవకాశం లభించింది. రాష్ట్రపతి పదవిలో ఉన్న సమయంలో కోవింద్ ఇచ్చిన సూచనలు, చూపిన ప్రత్యేకమైన ఆప్యాయత నాకు ఎంతో విలువైన ఆస్తిగా నిలిచాయి. ఆయన జీవిత అనుభవాలు, ఎదుర్కొన్న సవాళ్ల నుంచి దేశ యువత ఎంతో నేర్చుకోవచ్చు. ఆయన ఆలోచనలు, అనుభవాలను కొత్త తరం తెలుసుకోవాలి. పుస్తకానికి ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్ అనే పేరు పెట్టడం ఎంతో సముచితం. కోవింద్ జీవితంలో ఎదురైన పోరాటాలు వ్యక్తిగతమైనవే కానీ. వాటి ఫలితంగా సాధించిన విజయం మాత్రం భారత గణతంత్రానికి, దేశ ప్రజాస్వామ్యానికే చెందుతుందన్న సందేశం ఈ శీర్షికలో ఉంది' అని ప్రధాని మోదీ అన్నారు.

# టాటా సన్స్ ఛైర్మన్ పదవికి చంద్రశేఖరన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)

రాజీనామా చేయడం ప్రాముఖ్యత సంతరించుకుంది. టాటా గ్రూప్‌లో తాను 40 ఏళ్ల పాటు వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థకు సేవలందించడం ద్వారా సంతృప్తికరమైన అవకాశం లభించిందన్నారు. అందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా టాటా సన్స్‌కు నాయకత్వం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఇది అపారమైన బాధ్యత అని అభివర్ణించారు. వారసత్వంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా టాటా బోర్డుకు ఆయన విజ్ఞప్తి చేశారు. 2027, ఫిబ్రవరి 20వ తేదీ వరకు ఆయన పదవి కాలం ఉంది. కానీ కొన్ని నెలల ముందే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాతో టాటా సంస్థ షేర్లు దాదాపు 5 శాతం మేర పడిపోయాయి.గతంలో చంద్రశేఖరన్ టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటీవ్‌గా పని చేశారు. 2017లో టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ నియమితులయ్యారు. నాటి నుంచి ఆయన అదే పదవిలో కొనసాగుతున్నారు. అయితే ఈ సంస్థ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను మళ్లీ నియమించడంపై టాటా సన్స్, టాటా ట్రస్ట్ మధ్య వివాదం నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా చేశారని తెలుస్తోంది. టాటా గ్రూప్ సంస్థలో స్టీల్, మోటర్స్, టీసీఎస్, ఇండియన్ హోటల్స్ ఉన్నాయి. ఎన్ చంద్రశేఖరన్ ఇప్పటి వరకు వీటికి ఛైర్మన్‌గా వ్యవహరించారు.

# జింబాబ్వేలో ఘోర ప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

అమ్ముడయిన టిక్కెట్ల ఆధారంగా ప్రమాద సమయంలో ఐదుగురు సిబ్బందితో సహా 114 మంది ప్రయాణిస్తున్నట్టు తెలిసిందని, టిక్కెట్ల ఏజ్‌కు దిగువనున్న పిల్లల సంఖ్య తెలియాల్సి ఉందని జింబాబ్వే ప్రొటక్షన్ యూనిట్ ఒక ప్రకటనలో తెలిపింది.కాగా, పడవ సామర్థ్యం 90 మందికే సరిపోతుందని, ఎక్కువ మందిని ఎక్కించుకోవలడం వల్ల ప్రమాదం జరిగినట్టు అనుమానిస్తున్నామని జాతీయ విపత్తుల నిర్వహణ ఏజెన్సీ తెలిపింది. ప్రస్తుతం గల్లంతైన ప్రయాణికుల కోసం ముమ్మరంగా గాలింపు చర్చలు జరుగుతున్నాయి. ప్రమాదానికి స్పష్టమైన కారణాలు, గల్లంతైన వారి సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జింబాబ్వే-జాంబియా సరిహద్దులో కరీబా సరస్సు ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలు కరీబా పట్టణానికి వెళ్లేందుకు పడవలు ఉపయోగిస్తుంటారు.

# కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:**

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా కేరళంగా మార్చే ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. కేరళ పేరు మార్పు బిల్లుకు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ బిల్లు ఆమోదం పొందింది. 'కేరళ బిల్లు-2026'ను లోక్‌సభ మంగళవారం ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదించింది. రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చాలని కోరుతూ కేరళ శాసనసభ 2024లో తీర్మానం చేసింది. మలయాళంలో రాష్ట్రాన్ని సాధారణంగా 'కేరళం'గా పిలుస్తుండగా, రాజ్యాంగంలోని అధికారిక పేరు మాత్రం 'కేరళ' అనే కొనసాగుతోంది.

# రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీ-రన్.. ఫ్యామిలీ-డ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంఎ÷-లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకోవచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అనే డిఫెన్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ.200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుముల హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# డిఫాల్టర్ మిల్లర్ల నుంచి బకాయిల వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోదాంల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని సూచించారు. గోదాంల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులను వినియోగించుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ప్రతి జిల్లాకు ఓ నోడల్ అధికారిని నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# మహారాష్ట్ర సిఎస్‌తో సంజయ్ జాజు భేటీ

## - తెలంగాణ అభివృద్ధి తదితర అంశాలపై చర్చ

**హైదరాబాద్,ఆగస్టు 12 :** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి ప్రగతి, 'రైజింగ్ తెలంగాణ 2047' విజన్ తదితర అంశాలను వివరించారు. తెలంగాణ-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఉన్న సత్సం బంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, పరస్పర సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిఎండి సి.ఎస్. శెట్టిను ముంబైలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, 'రైజింగ్ తెలంగాణ 2047' లక్ష్యాలు తదితర అంశాలను ఆయన ఎస్‌బీఐ సీఎండీకి వివరించారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సంజయ్ జాజు వివరించారు.

# కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్‌కు నేడు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన

● పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను

సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం: మదన్ మోహన్



బాలానగర్ ఆగస్టు 13 ( పీపుల్స్ న్యూస్)
కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రేపు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబం జీవితంలో ఒక ముఖ్యమైన కల అని, హైదరాబాద్‌లోని పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మదన్ మోహన్ తెలిపారు.

-- పేదల ఇళ్ల కలకు ఇందిరమ్మ టవర్స్.....
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో ఇందిరమ్మ టవర్స్ ద్వారా వేలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు పక్కా ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇది కేవలం ఇల్లు మాత్రమే కాద ని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితానికి పునాది అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదలకు రెండు పడకగదుల ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఆ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

-- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యం...
హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను చేపడుతోందని మదన్ మోహన్ తెలిపారు. మూసీ నది అభివృద్ధి: సుమారు 55 కిలోమీటర్ల మేర మూసీ నదిని పునరుజ్జీవింపజేసి, వరదల సమస్యను తగ్గించడంతో పాటు నదీ తీర ప్రాంతాల్లో రహదారులు, పచ్చదనం, వాణిజ్య ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మెట్రో రైలు విస్తరణ: కూకట్‌పల్లి--బీహెచ్ఈఎల్, నాల్గవ నగరం, నాగోల్--ఎల్‌బీ నగర్--హయత్‌నగర్, రాయదుర్గం--కోకాపేట్ తదితర ప్రాంతాలను అనుసంధానించేలా మెట్రో రైలు విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కొత్త మెట్రో మార్గాల ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ నగరం: సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచస్థాయి భవిష్యత్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. సమాచార సాంకేతికత, ఔషధ పరిశ్రమలు, సమాచార కేంద్రాలు, విద్యా సంస్థలకు ఇది కేంద్రంగా మారి యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. రహదారుల విస్తరణ: ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరిచేందుకు రేడియల్ రహదారుల అభివృద్ధి, బాహ్య వలయ రహదారితో అనుసంధానం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వీటి ద్వారా కూకట్‌పల్లి, మియాపూర్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గే అవకాశం ఉందన్నారు.

-- సంక్షేమ పథకాలతో ప్రజలకు అండ.....
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.4 కోట్ల మంది పేద, మధ్యతరగతి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నట్లు మదన్ మోహన్ తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వర కు ఉచిత విద్యుత్, రైతు భరోసా, యువతకు నైపుణ్య శిక్షణ వం టి కార్యక్రమాలు కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నాయని అన్నారు.

-- అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం అనే రెండు ప్రధాన అంశాలతో ముందుకు సాగుతోందని మదన్ మోహన్ అన్నారు. కూకట్‌పల్లి నుంచి భవిష్యత్ నగరం వరకు, మూసీ నుంచి మెట్రో వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరగనున్న ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ కోరారు.

## అపరమేధావి డా.జి దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు.



ఖమ్మం/ఆగష్టు12/పీపుల్స్ న్యూస్)
నేలకొండపల్లిలో అపరమేధావి డా. జి దివ్యమూర్తి అభిమానుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. దివ్యమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిమానులు కేక్ కటింగ్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ యువతలోని ఉత్సాహం దేశ అభివృద్ధికి ఇంధనం అని, యువత దేశానికి వెన్నెముకని, వారి ఆలోచనలు దేశ భవిష్యత్తుకి బాటలు వేస్తాయని కాబట్టి ప్రతి సంవత్సరం ఇలాంటి వేడుకలు నిర్వహించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘం రాష్ట్ర సమన్వయకర్త కట్టెకోల వెంకటేశ్వరరావు, అభిమానుల సంఘం రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు వడ్లమూడి శ్రీనివాసరావు, అభిమానుల సంఘం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బొల్లికొండ పిచ్చయ్య, కందర బోయిన భాను, గడ్డం లక్ష్మయ్య, మాతంగి వీరబాబు, మాతంగి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బుద్ధుని బోధనలు పంచశిలాల విశిష్టతను బోధించిన బౌద్ధ భిక్షు సద్దారఖీత.




ఖమ్మం /ఆగష్టు12/(పీపుల్స్ న్యూస్)
ఖమ్మం జిల్లా నేలకొండపల్లి బౌద్ధ స్థూపం వద్ద ఖమ్మం పట్టణం లోని " విద్యా క్షేత్ర స్కూల్ " మరియు " జాన్సన్ కిడ్స్ స్కూల్ " విద్యార్థులు, యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు సందరి్శంచడం జరిగింది. ఈసందర్భంగా వారికి ( భిక్షు సద్దా రఖిత ) బుద్ధుని బోధనలు పంచశీ లాల గురించి వివరించి ప్రవచనం ఇవ్వడం జరిగింది. అలాగే "ఆనాపానా ధ్యానం " అభ్యాసం చేయించి వివరించడం జరిగింది.తదనతరం భక్త రామదాసు జన్మస్థానాన్ని సందర్శించారు,ఈ కార్యక్రమం లో విద్యా క్షేత్ర స్కూల్ డైరెక్టర్ నాగభూషణం గారు, సౌభాగ్య గారు భారతి , జాన్సన్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు, స్టాఫ్ మరియు నేలకొండపల్లి జూనియర్ కాలేజీ అధ్యాపకులు రవి కుమార్ , పర్యావరణ వేత్త రవి కుమార్ , ఖమ్మం



పట్టణం సామాజిక కార్యకర్తల దా - జాఫర్ మరియు బి. సి. నాయకులు కత్తి నెహ్రూ పాల్గొన్నారు.

# అమావాస్య అన్నదానం మహాదానం.. సేవా కార్యక్రమాలు అభినందనీయం

● ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా

అన్నదాన కార్యక్రమం.. ముఖ్య అతిథిగా పాల్గొన్న

మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్



బాలానగర్ ఆగస్టు 13 ( పీపుల్స్ న్యూస్)
ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానికులు, సంఘ సభ్యులకు అన్నప్రసాదాన్ని అందించారు. అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సేవాభావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవకు ప్రతీకగా నిలిచింది. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ, "అన్నదానం మహాదానం" అని అన్నారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమని, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా నిరంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఆర్య వైశ్య సంఘం నిర్వాహకులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి నిరుపేదలు, అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గందె గౌరీ శంకర్, ఉప్పల రాజేష్, దండుగుల యాదగిరి, ప్రాజెక్ట్ చైర్మన్ సత్యమూర్తితో పాటు సంఘం నిర్వాహకులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాటం.. మార్పు కావాలి: జి.కృష్ణ

● నాలుగు కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

● కార్మిక వర్గానికి న్యాయం చేయాలని సీపీఐ డిమాండ్

●కూకట్‌పల్లి ప్రశాంతినగర్ పారిశ్రామిక ప్రాంతంలో

సీపీఐ విస్తృత ప్రచారం



బాలానగర్ ఆగస్టు 13 ( పీపుల్స్ న్యూస్)
కార్మిక వర్గ హక్కులను పరిరక్షించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక చట్టాల మార్పులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జాతీయ పార్టీ పిలుపు మేరకు ఆగస్టు 6 నుంచి 14వ తేదీ వరకు చేపడుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కూకట్‌పల్లి మండలం ప్రశాంతినగర్ పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరై కార్మికులు, స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన నాలుగు కార్మిక చట్టాలను తొలగించడం లేదా వాటి స్థానంలో కొత్త కార్మిక కోడ్‌లను తీసుకురావడం వల్ల కార్మిక వర్గానికి నష్టం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

-- కార్మిక హక్కులకు రక్షణ కల్పించాలి......
కార్మికులు ఎన్నో సంవత్సరాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులు, సంక్షేమ సదుపాయాలకు ప్రస్తుత మార్పులు విఘాతం కలిగించే అవకాశం ఉందని జి.కృష్ణ పేర్కొన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని ప్రదేశాల్లో రక్షణ, సామాజిక భద్రత, ఇతర సంక్షేమ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక చట్టాల్లో మార్పుల కారణంగా కార్మిక వర్గం, రైతు కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు భవిష్యత్తులో మరిన్ని సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను బలహీనపరిచే చర్యలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

-- పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి.........
కార్మికులకు రక్షణ కల్పించేలా గతంలో అమల్లో ఉన్న నాలుగు కార్మిక చట్టాలను పునరుద్ధరించి, కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడాలని జి.కృష్ణ కోరారు. కార్మికుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, కార్మిక సంఘాలతో చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. "బద్లవ్ జరూర్ హై.. మార్పు కావాలి" అనే నినాదంతో సీపీఐ చేపడుతున్న ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లిలో కార్మికులు, ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి కేంద్ర ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించారు. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్తులో కూడా నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీనగర్ శాఖ కార్యదర్శి కె.మనోచారి, గంగన్న, రాజుగౌడ్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొని సీపీఐ నాయకుల నుంచి కరపత్రాలను స్వీకరించారు.

## ఆగస్టు 13న ఆ విద్యార్థులకు సన్మానం:



**హైదరాబాద్, ఆగస్టు 12 ():** ప్రతిభావంతులైన మైనారిటీ విద్యార్థులను ఆగస్టు 13వ తేదీన సన్మానిస్తామని తెలంగాణ మంత్రి అజహరుద్దీన్ ) పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఏర్పాట్లపై మంత్రి అజహరుద్దీన్ ఈరోజు (బుధవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-1, గ్రూప్-2లో ప్రతిభ చూపిన మైనారిటీ విద్యార్థులను సన్మానిస్తామని చెప్పుకొచ్చారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తామని మంత్రి వెల్లడించారు. ూూజ, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ు+వీ=జు×ూ విద్యార్థులను సత్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. అగ్నిమాపక భద్రత, పౌర సదుపాయాలు, లాజిస్టిక్స్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించామని తెలిపారు.వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మైనారిటీ విద్యార్థుల విద్యా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. విద్యార్థుల విజయాలు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలని మంత్రి అజహరుద్దీన్ పేర్కొన్నారు.

# నేలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ.






**ఖమ్మం /ఆగష్టు 12/(పీపుల్స్ న్యూస్ )**
పాలేరు అసెంబ్లీ నియోజకవర్గంలోని నేలకొండపల్లి టౌన్‌లో హర్ ఘర్ తిరంగా కమిటీ ఆధ్వర్యంలో ప్రియతమా ప్రధాని నరేంద్ర మోదీ పిలువు మేరకు దేశభక్తి నినాదాలతో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు, యువత, ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండపల్లి శ్రీధర్ రెడ్డి, కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు, వరంగల్ జిల్లా ప్రభారీ హాజరై ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. "జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక. ప్రతి భారతీయుడిలో దేశభక్తి భావాన్ని మరింత బలపరచాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకం. యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి" అని అన్నారు. నేలకొండపల్లి పట్టణ వీధుల్లో సాగిన తిరంగా ర్యాలీ జాతీయ జెండాలతో ఆకట్టుకుంది. "భారత్ మాతాకీ జై", "వందే మాతరం" నినాదాలతో పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్.. తిరంగా ర్యాలీ పాలేరు అసెంబ్లీ ఇన్చార్జ్ అనంతు ఉపేందర్ గౌడ్.. మండల తిరంగా ర్యాలీ కన్వీనర్ సూరేపల్లి జ్ఞాన రత్నం గుండు అజయ్ సురేష్ హనుమంతు సాగర్ మన్నె కృష్ణయ్య గోవిందు సురేష్ బాజా రామకృష్ణ దివాకర్ అనిల్ హర్ష గణేష్ వందే మాతరం! భారత్ మాతాకీ జై!

# బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ.



**చిట్యాల, ఆగస్టు 12 :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం చిట్యాల పట్టణ కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీకే వెంకన్న ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కనకదుర్గ ఆలయం నుంచి మార్కెట్ యార్డు వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా భారతదేశ గొప్పతనం, జాతీయ పతాక ఔన్నత్యాన్ని ప్రజలకు వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు పోరాడిన మహనీయులను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మైల నరసింహ, చంద్రశేఖర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్, చిట్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి సుంచు శీను, మండల ప్రధాన కార్యదర్శి పున్నం విష్ణు, మాస శ్రీనివాస్, పొట్లపల్లి నరసింహ, కూరెళ్ల శ్రీనివాస్, కన్నబోయిన మహాలింగం, గంజి గోవర్ధన్, నరేంద్రచారి, జయరపు రామకృష్ణ, వరికుప్పల నరసింహతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, స్థానిక యువత పాల్గొన్నారు..

# సమ సమాజ నిర్మాణ స్థాపనే ఎమ్మార్పీఎస్ మరియు ఎమ్మెస్పీల ప్రధాన లక్ష్యం.

**- వంగూరి ఆనందరావు మాదిగ**
**వరంగల్ జిల్లా ఇన్చార్జి**





**వరంగల్ /ఖమ్మం /ఆగష్టు12/(పీపుల్స్ న్యూస్ )**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ మరియు మహాజన సోషలిస్ట్ పార్టీ ఎం ఎస్ పి నూతన కమిటీల నిర్మాణంలో భాగంగా వరంగల్ మండల పరిధిలోని వేణుమామల మరియు ఐలమ్మ నగర్బస్తీలలో వరంగల్ మండల ఇన్చార్జి కన్నబోయిన ప్రమోద్ మాదిగ అధ్యక్షతన జరిగిన బస్తీ కమిటీల సమావేశాలలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా ఇన్చార్జి వంగూరి ఆనందరావు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడినారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన నిర్మాణ కమిటీలను పటిష్టంగా నిర్మించాలని ఆయన పిలుపునిచ్చినారు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ మరియు మహాజన సోషలిస్ట్ పార్టీ ఎంఎస్పీ కమిటీలను పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని సంస్థ గత నిర్మాణాలను చేయటంలో జిల్లాలోని ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి కమిటీల రాష్ట్ర జిల్లా మండల నాయకులు ఆయా మండలాల నియోజకవర్గాల ఇన్చార్జిలు బాధ్యతగా వ్యవహరించి కమిటీల నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయాలని ఆయన తృపిలుపునిచ్చినారు సమాజంలోని సమస్త వర్గాల ప్రజల కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తీసుకునే నిర్ణయాలకు ఠసమసమాజ నిర్మాణ స్థాపన కోసం జరిగే ఈ నిర్మాణ కమిటీలను రాజకీయాలకతీతంగా కమిటీల నిర్మాణములో బాధ్యులను నియమించాలని ఆయన సూచించారు ఈ సమావేశాలలో వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి గంగారపు మల్లన్న మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు ఇసంపల్లి రాజు మాదిగ వికలాంగులకు హక్కుల పోరాట సమితి జిల్లా సీనియర్ నాయకులు కన్నూరు చంద్రశేఖర్ మాదిగ ఐలమ్మ నగర్ బస్తీ కమిటీ నాయకులు స్వామి మాదిగ ఏకయ్య మాదిగ దండు చక్రపాణి మాదిగ దామెర సదానందం మాదిగ జన్ను సన్నీ మాదిగ వేణుమామల గ్రామ ఎమ్మార్పీ ఎసు నూతన కమిటీ అధ్యక్షులుగా దామెర కరుణాకర్ మాదిగ అధికార ప్రతినిధిగా దామర అశోక్ మాదిగ నూతన కమిటీ బాధ్యులుగా దామెర ప్రవీణ్ మాదిగ దామర ప్రణీత్ మాదిగ దామెర మణిరత్నం మాదిగ సదరం అన్విత్ మాదిగ కుక్కమూడి రోహిత్ మాదిగ దామెర సందీప్ మాదిగ ఇల్లందుల కార్తీక్ మాదిగ దండు నవీన్ మాదిగ దండ దిలీప్ మాదిగ దామర సన్నీ మాదిగ కుక్కమూడి అరవింద్ మాదిగ దామెర అశోక్ మాదిగ దామెర ఆశీర్వసంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

# చిట్యాల లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన అదనపు కలెక్టర్:



**చిట్యాల, ఆగస్టు 12 (**
చిట్యాల పట్టణ కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. ప్రేమ్ కరణ్ రెడ్డి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలిపారు.
ఆయన వెంట హౌసింగ్ పీడీ లోకిలాల్, హౌసింగ్ డీఈ అబ్దుల్ వజీద్, ఏఈ ప్రీతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్, కమిషనర్ గురులింగం, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీ లక్ష్మి సైదులు, మున్సిపల్ కౌన్సిలర్లు, హౌసింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు..

# ఉగ్గిడి పెద్ద మల్లయ్య మృతికి నివాళు లర్పించిన కాటం వెంకటేశం



**చిట్యాల,ఆగస్టు 12**
నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం వ్యక్తిగత సహాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్ యాదవ్ తండ్రి ఉగ్గిడి పెద్ద మల్లయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయానికి చిట్యాల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాటం వెంకటేశం ఘనంగా నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ ఏను రఘుమారెడ్డి, చిన్నకాపర్తి సర్పంచ్ ఆవుల సుందర్ యాదవ్, అంతటి నరసింహ , అంశాల శ్రవణ్ తో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని పెద్ద మల్లయ్య కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# బిజెపి వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ



**వలిగొండ ఆగస్టు 12** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు వలిగొండ మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో పాల్గొన్న జాతీయవాదులు, బిజెపి నాయకులు, వివిధ కుల సంఘాల పెద్దలు మాట్లాడుతూ ఈ తిరంగా ర్యాలీ దేశ ప్రజల యొక్క ఐక్యతను తెలియజేస్తుందని, అందుకు ఈ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు నేటి బాలలే రేపటి పౌరులని వారందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని, దేశ ఔన్నత్యం కోసం ప్రతి ఒక్క భారతజాతి బిడ్డ పనిచేయాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్, వలిగొండ సర్పంచ్ వెంకట పాపిరెడ్డి, బీసీ సంఘం నాయకులు సాయిని యాదగిరి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు యాదగిరి, బిజెపి సీనియర్ నాయకులు రాచకొండ కిష్టయ్య, కనతాల అశోక్ రెడ్డి, బందారపు రాములు,రాస వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మైసొల్ల రామనర్స్, జిల్లా నాయకులు బచ్చు శ్రీనివాస్, మైసొల్ల మచ్చగిరి మండల పదాధికారులు నాగరాజు, రంజిత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లో డే లింగస్వామి గౌడ్, మండల కార్యదర్శిలు వెంకటేశం, మహేష్, శ్రీనివాస్, మండల నాయకులు నరసింహ, రామచంద్రం,చిన్న మచ్చ గిరి, పెద్ద కిట్టు, వెంకటేశం, జంగయ్య, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**- ఎస్ ఐ అరుణ్ కుమార్**



**దౌల్తాబాద్ ఆగష్టు 12**
గ్రామీణ నిరుపేద నిరుద్యోగ యువత అఖిల రాజ్ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ ఎస్ ఐ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. అఖిల రాజ్ ఫౌండేషన్ మరియు లయన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించే ప్రిలిమినరీ పరీక్ష లో మండల పరిధిలోని యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు భరించలేని వారికి ఇది ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో తిరుమలాపూర్ సర్పంచ్ బండారు లాలు, నాయకులు డప్పు శివరాజ్, సీనియర్ జర్నలిస్ట్ శంభు లింగం, పలు సంఘాల నాయకులు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, పాల్గొన్నారు.

# అట్టహాసంగా జేఎన్టీయూహెచ్ విద్యార్థి నాయకుడు ఎరవెల్లి జగన్ జన్మదిన వేడుకలు.


**శుభాకాంక్షలు తెలిపిన పీపుల్స్ న్యూస్ ఎడిటర్ శ్రావణ్ కుమార్.**


















**కూకట్ పల్లి : ఆగస్టు 12 (పీపుల్స్ న్యూస్)** డీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జేఎన్టీయూహెచ్ స్టూడెంట్ జేఏసీ చైర్మన్ ఎరవెల్లి జగన్ జన్మదిన వేడుకలు జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూహెచ్)లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ అధికారులు, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు, విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, విద్యార్థులు హాజరై జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినాన్ని పురస్కరించుకుని జేఎన్టీయూహెచ్ లైబ్రరీ ఆవరణలో జగన్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో చేరిన నాటి నుంచి ప్రతి జన్మదినం సందర్భంగా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. అనంతరం పీపుల్స్ న్యూస్, ప్రజా వీక్షణం దినపత్రిక ఎండీ, చైర్మన్ శ్రావణ్ కుమార్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సామాజికవేత్త కేవీ ప్రసాద్లు జగన్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు జగన్ చూపుతున్న చొరవ అభినందనీయమ న్నారు. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొని, అణిచివేతను అధిగమిస్తూ ఎదిగిన యువ నాయకుడి గా జగన్ నిలిచారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో యువతకు జగన్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ నాన్-టీచింగ్ అసోసియేషన్ నాయకులతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆల్ యూనివర్సిటీ నాన్-టీచింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొని జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ నాయకులు శేషరెడ్డి, సూర్యోదయం తెలంగాణ ఎడిటర్ భాష, భగత్‌సింగ్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ కరణ్ సింగ్, ఎన్ ఎస్ యూ ఐ రాష్ట్ర సెక్రటరీ అరుణ్ రెడ్డి, సందీప్, సాయిరాజు, ధర్మతేజ, ఇడిగ దినకర్, బండి ప్రసాద్ రెడ్డి, ప్రణయ్, రూప్ సింగ్ నాయక్, సోను తదితరులు పాల్గొన్నారు. పలు జిల్లాల్లో సేవా కార్యక్రమాలుఎం ´వెల్లి జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టి పేదల ఆకలి తీర్చారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో విద్యార్థులు మొక్కలు నాటి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ జిల్లాల్లో డిప్లొమా స్టూడెంట్స్ ఫెడరేషన్, స్టూడెంట్ జేఏసీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుతూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# పెబ్బేరులో భక్తి పారవశ్యంతో చౌడేశ్వరీదేవి జయంతి



**పెబ్బేరు, ఆగస్టు 12**
శ్రీ కృష్ణ యాదవ సంఘం, యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ పూజారి చంద్రయ్య, అర్చకులు గోపి వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు. జయంతి సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. డోలు వాయిద్యాల హోరు, సిగసత్తుల ఉరుములతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మిన్నంటింది. తెల్లవారుజాము నుండే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేడుకలను శ్రీ కృష్ణ యాదవ సంఘం, యువజన సంఘాల సభ్యులు విజయవంతంగా నిర్వహించారు.

# బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



**నర్వ, 12 ఆగస్టు** మండల పరిధిలోని పెద్ద కడుమూర్ గ్రామానికి వెళ్ళుతూ బైక్ అద్భుతప్పి వ్యక్తి మృతి చెందినట్లు నర్వ ఎస్సై ఇచ్చిన సమాచారం మేరకు
తేదీ 12/08/2026 నాడు మక్తల్ గ్రామానికి చెందిన కావలి రాము (33) పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం అతని తమ్ముడు కావలి గోవర్ధన్ (24) తేదీ 11/08/2026 రాత్రి 8:30 గంటలకు తన బైక్ (TS 06EY0921) పై బయటికి వెళతానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయటికి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. రాత్రి 11:10 గంటల సమయంలోపెద్దకడుమూరు గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద గోవర్ధన్ బైక్ పై వెళుతూ రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయే ప్రమాదవశాత్తు బైక్ పైన నుంచి కిందపడి రోడ్డుపై తీవ్రమైన గాయాలతో ఉండటాన్ని అటుగా వెళుతున్న కోమటి వినయ్ కుమార్ అనే వ్యక్తి గమనించి డైల్ 100'కు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేయడం జరిగిందని అన్నారు. అనంతరం క్షతగాత్రుని చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, తల వెనకాల బలమైన గాయం కావడంతో అధిక రక్తగాయం కావడం వల్ల గోవర్ధన్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడం జరిగిందని నర్వ ఎస్సై పబ్బతి రమేష్ తెలియజేశారు.

# చేయూత పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ




**మంథని, ఆగస్టు 12 :** మంథని మున్సిపాలిటీ పరిధిలో చేయూత సామాజిక భద్రత పింఛన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఒడ్నాల శ్రీనివాస్, కమిషనర్ తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ తదితర కేటగిరీలకు చెందిన అర్హులు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ఉన్న వారు ఆగస్టు 30, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు అవసరమైన ధ్రువపత్రాలతో మంథని మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు చేయూత పింఛన్ పొందని వారు ఆగస్టు 30లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిన్న రామచర్ల లో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ...!

**- జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్...!!**



**జనగామ/బచ్చన్నపేట/ చిన్నరామచర్ల, ఆగస్టు 12** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చిన్న రామచర్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విగ్రహ ప్రతిష్ట కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా గాదపాక దిలీప్ వహించగా, ముఖ్య అతిథులుగా... జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్, జేపీ రాజు, పాశం యాదగిరి సీనియర్ జర్నలిస్టు, మాస్టర్ జి, ఎన్ సంజీవులు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.... అంబేద్కర్ చేసినటువంటి పోరాటాలు సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహమ్మద్ అజం, ఉప సర్పంచ్ కంత్రి యాదగిరి, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పైసల రాజశేఖర్, ఎమార్పిఎస్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి అల్వాల్ రాజు, మండల ఇన్చార్జి పాకాల కుమారస్వామి, బాలమణి శ్రీనివాస్, జేపీ రాజు, పాశం యాదగిరి సీనియర్ సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మహమ్మద్ మసూద్, జంగిటివిద్యనాథ్, మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి కావ్య శ్రీ రెడ్డి, మరియు విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు వినోద్, లక్ష్మయ్య, కళ్లెం రమేష్, కంత్రి సత్తయ్య, భాను, ప్రశాంత్, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెరువులో భారీ మొసలి సంచారం

**- స్థానికుల్లో తీవ్ర ఆందోళన**



**పెబ్బేరు, ఆగస్టు 12** మహబూపాల్ సముద్రంలో భారీ మొసలి సంచరిస్తుండటంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. చెరువులోని ఒక చిన్న గడ్డి భూమిపై సుమారు 8 నుండి 10 అడుగుల పొడవు ఉన్న భారీ మొసలి విశ్రాంతి తీసుకుంటున్న దృశ్యాలు స్థానికుల దృష్టికి వచ్చాయి. చెరువు పరిసర ప్రాంతాల్లో రైతులు ప్రతిరోజూ పశువులను తీసుకెళ్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల చెరువుల్లో మొసళ్ల దాడిలో పశువులు మృతి చెందిన ఘటనలు జరిగాయని, అందుకే ముందస్తు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి మొసలిని సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# 3 నెలల రేషన్ ఒకేసారి.. పెబ్బేరులో అల్లకల్లోలం

- గంటల తరబడి క్యూలు.. వృద్ధులు,మహిళల అవస్థలు



**పెబ్బేరు, ఆగస్టు 12** ప్రభుత్వం 3 నెలలకు సరిపడా రేషన్ సరుకులను ఒకేసారి పంపిణీ చేయడంతో పట్టణంలోని రేషన్ షాపుల వద్ద జనసంద్రంగా మారింది.తెల్లవారుజాము నుంచే కార్డుదారులు భారీగా వచ్చారు. వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లలను ఎత్తుకున్న మహిళలు గంటల తరబడి నిలబడి తీవ్ర అవస్థలు పడ్డారు.ఒకేసారి రద్దీ పెరగడంతో పంపిణీ వ్యవస్థ గందరగోళంగా మారింది. ఒక్కో షాపు ముందు వందల మంది లైన్లలో నిలబడ్డారు. నెమ్మదిగా సాగుతున్న పంపిణీతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒకేసారి 3 నెలల సరుకులు ఇవ్వడం వల్లే ఈ గందరగోళమని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఘనంగా ఎస్సార్ రంగనాథన్134 జయంతి వేడుకలు

పాల్గొన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు



**భూపాలపల్లి ఆగస్టు 12** భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ 134 జయంతిని పురస్కరించుకొని బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు శ్రీ కోట రాజబాబు గారు ఎస్సార్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సార్ రంగనాథన్ తన జీవితాన్ని గ్రంథాలయాల అభివృద్ధికి అంకితం చేశారని అన్నారు. ఆయన రూపొందించిన గ్రంథాలయాల నియమాలు వర్గీకరణ పద్ధతులు గ్రంథాలయ రంగానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డి రాజేంద్రప్రసాద్, లైబ్రేరియన్ కృష్ణ, రాణి గారితో పాటు గ్రంథాల సిబ్బంది పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం, ఘనంగా నిర్వహించాలి.

వీడియో, కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక



**భూపాలపల్లి ఆగస్టు 12:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలో ప్రజావాణి నిర్వహణకు ఎంపీడీవోను నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేసేందుకు హెల్ప్ డస్క్ లు, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, డాటా ఎంట్రీ, సదుపాయం ఏర్పాటు చేయాలని అర్జీలు రాయడంలో ప్రజలకు సహాయం అందించాలని తెలిపారు. ప్రజల సౌకర్యం తాగునీరు తగినన్ని కుర్చీలు దివ్యాంగుల కోసం వీల్ చైర్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డి ఆర్ డి ఓ బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎక్సైజ్ ఈస్ కిరణ్, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటరత్నం మండల కేంద్రాల నుంచి తహసీల్దారులు ఎంపీడీవోలు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం...టీవీవీయూ గణిత




**మరికల్, 12 ఆగష్టు :** ఏ దేశమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఆ దేశ యువత కీలకమని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా మహిళా కార్యదర్శి గణిత అన్నారు. బుధవారం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట పట్టణ కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ( టీవీవీయూ ) ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభలో ఉట్కూరు మండల కో ఆర్డినేటర్ గణిత, ధన్వాడ మండల కోఆర్డినేటర్ మానస మాట్లాడుతూ యువత అందరూ చదువుతో పాటు తమ తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని అలాగే రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులతో వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణ కోసం సేంద్రియ వ్యవసాయం అవసరమనే అంశంపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మునిమోక్షం కేశవులు, ఏదిర నర్సింలు, చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాండా దేశానికి చెందిన ఓ మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**హైదరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో ఆగస్టు 12 (పీపుల్స్ న్యూస్) :** అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉగాండా దేశానికి చెందిన ఓ మహిళను టోలీచౌకి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశ భద్రతకు భంగం కలిగించే అవాంఛనీయ కార్యకలాపాలకు పాల్పడకుండా నిరోధించే క్రమంలో, విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ బృందం ఉగాండా దేశానికి చెందిన నబంజ శారన్ (36) అనే మహిళను అదుపులోకి తీసుకుని, ఆమె స్వదేశమైన ఉగాండాకు బహిష్కరించింది (డీపోర్ట్ చేసింది). విచారణ సమయంలో హైదరాబాద్‌లో తన నివాసానికి సంబంధించి ఆమె ఎలాంటి సంతృప్తికరమైన సమాధానాలు గానీ, సరైన పత్రాలు గానీ సమర్పించలేకపోయింది. సమగ్ర విచారణ అనంతరం, తన వద్ద చెల్లుబాటు అయ్యే వీసా లేదని, వీసా గడువు ముగిసినప్పటికీ భారతదేశంలో అక్రమంగా కొనసాగుతున్నానని ఆమె అంగీకరించింది. మరింత లోతుగా దర్యాప్తు చేయగా, ఆమె 2019 మార్చి 6న ఈ-టూరిస్ట్ వీసాపై ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా భారతదేశానికి వచ్చినట్లు వెల్లడైంది. అనంతరం ఉపాధి నిమిత్తం బెంగళూరుకు వెళ్లి, అక్కడ చిన్నచిన్న పనులు చేసింది. ఆ తర్వాత సులభంగా డబ్బు సంపాదించి విలాసవంతమైన జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో మాదకద్రవ్యాల ముఠాలతో పరిచయాలు ఏర్పరచుకుంది. ఈ క్రమంలో బెంగళూరు, హైదరాబాద్‌లలో డ్రగ్ పెడ్లర్లతో కలిసి ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాలుపంచుకుంది. ఆమె టూరిస్ట్ వీసా గడువు 2019 మే 4 నాటికే ముగిసింది; అయితే ఆమె పాస్‌పోర్ట్ 2027 నవంబర్ 23 వరకు చెల్లుబాటులో ఉంది. వీసా గడువు ముగిసినప్పటి నుండి ఆమె భారతదేశంలో అక్రమంగా నివసిస్తూ, డ్రగ్ పెడ్లర్లతో సంబంధాలు కొనసాగిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతోంది. ఆమెను స్వదేశమైన ఉగాండాకు పంపించేందుకు హై -న్యూస్ విభాగం హైదరాబాద్‌లోని ఎఫ్.ఆర్.ఆర్.ఓ ద్వారా బహిష్కరణ (డీపోర్టేషన్) ప్రక్రియను ప్రారంభించింది. బయోమెట్రిక్ వివరాలను పరిశీలించి, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ టూరిస్ట్ వీసా గడువు ముగిసినట్లు నిర్ధారించారు. అనంతరం హైదరాబాద్ ఎఫ్.ఆర్.ఆర్.ఓ నుండి ఎగ్జిట్ పర్మిట్ పొంది, భవిష్యత్తులో ఆమె భారతదేశంలోకి ప్రవేశించకుండా 'బ్లాక్‌లిస్ట్' చేశారు. ఆమె ప్రయాణానికి సంబంధించి బుధవారం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విమాన టికెట్ బుక్ చేశారు.ఇన్‌స్పెక్టర్ ఎం. మధు బాబు నేతృత్వంలోని హై -న్యూ బృందం బుధవారం ఆమెను ముంబై తీసుకెళ్లి ఉగాండాకు డిపోర్ట్ చేసింది. దేశ భద్రతకు హానికరమైన అవాంఛనీయ కార్యకలాపాలను అరికట్టే





చర్యల్లో భాగంగా ఆమెను భవిష్యత్తులో భారతదేశంలోకి రాకుండా పూర్తిగా నిషేధించారు ప్రజలకు విజ్ఞప్తి:ఇటీవలి కాలంలో కొందరు విదేశీయులు మెడికల్ వీసా, స్టూడెంట్ వీసా, బిజినెస్ వీసా, టూరిస్ట్ వీసాలపై భారతదేశానికి వస్తున్నారు. పాస్‌పోర్ట్, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా అక్రమంగా ఇక్కడే ఉంటూ వివిధ రకాల మత్తుపదార్థాల రవాణా, సరఫరా, విక్రయాలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీని ఫలితంగా సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం, వ్యసనం పెరిగి కుటుంబాలు, సమాజం తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నాయి. హైదరాబాద్ నగర ప్రజలు ఎవరూ కూడా మత్తుపదార్థాల బారిన పడవద్దని హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ విజ్ఞప్తి చేస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచి, వారు మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తోంది. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా హై న్యూ బృందానికి 8712661601 నంబరు ద్వారా తెలియజేయగలరు. మనమందరం కలిసి పనిచేసి హైదరాబాద్ నగరాన్ని 'డ్రగ్ ఫ్రీ సిటీ'గా మారుద్దాం.ఈ ఆపరేషన్ మరియు డీపోర్టేషన్ ప్రక్రియను ఇన్‌స్పెక్టర్ పి. శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ ఎం. మధు బాబు హై -న్యూ సిబ్బంది విజయవంతంగా పూర్తి చేశారు.

# ఇందిరమ్మ ఎల్ఐజీ టవర్స్ కు శంకుస్థాపన కార్యక్రమం కు పటిష్ట భద్రత

- 300 మంది పోలీసులతో బందోబస్తు..
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన సైబరాబాద్ సీపీ





**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో ఆగస్టు 12 (పీపుల్స్ న్యూస్)** ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ తెలిపారు. కపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్, బుధవారం సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. బాంబ్ డిస్పోజల్ (బీడీ) బృందంతో ప్రాంగణంలో తనిఖీలు నిర్వహిం చారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సభా ప్రాంగణంతో పాటు ముఖ్యమంత్రి రాకపోకల మార్గాలు, ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున జనసమ్మర్థాన్ని నియంత్రిం చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని మోహరిస్తామని చెప్పారు. ట్రాఫిక్‌కు ప్రత్యేక ప్రణాళిక రద్దీ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడిం చారు. సీఎం కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మార్గాలను ముందుగానే పరిశీలించి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అనుమానాస్పద వస్తువులు, ఇతర భద్రతా సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని సంబంధిత



అధికారులను సీపీ ఆదేశించారు.పోలీసు, ట్రాఫిక్, జీహెచ్ ఎంసీ, ఆర్అండ్‌బీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని సీపీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. సభకు వచ్చే ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ బద్ధత ఏర్పాటలో పోలీసులు, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధ్యత కలిగిన నాయకుడే

# 283 గజాలు కబ్జా .! ?

- **అక్రమంగా 4 అంతస్తుల నిర్మాణం.**
- **టౌన్ ప్లానింగ్ ఏమి చేస్తుంది..!**

**కుత్బుల్లాపూర్: ఆగస్టు 12 (పీపుల్స్ న్యూస్)**

కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలపై అక్రమార్కుల కన్ను పడుతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. నకిలీ పత్రాలు, అక్రమ నిర్మాణాలతో తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాజులరామారం రెవెన్యూ పరిధిలోని భూ వ్యవహారాలు ఇందుకు ఉదాహరణగా మారుతున్నాయి. తాజాగా గాజులరామారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 329/8కు సంబంధించిన స్థలంపై ఆక్రమణ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ స్థలం యూఎల్‌సీ పరిధిలో ఉన్నప్పటికీ, కొందరు వ్యక్తులు నకిలీ పత్రాల ఆధారంగా సుమారు 283 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించి, అక్కడ 4 అంతస్తుల భవనం నిర్మిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టపగలే నిర్మాణ పనులు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు విమర్శిస్తున్నారు.

**ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయంటూ ఆందోళన.**



ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగంలో కొందరి నిర్లక్ష్యం కారణంగా విలువైన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి ్సన అధికారులే అక్రమ నిర్మాణాలపై సకాలంలో చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ తరాలకు ఉపయోగపడాల్సిన కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నా రు.ఇదిలా ఉండగా, గాజులరామారం పరిధిలో ప్రభుత్వ భూమిని అనధికారికంగా ఆక్రమించి నిర్మాణం చేపట్టారనే ఆరోపణలపై కుత్బుల్లాపూర్ మండల తహశీల్దార్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది.29 జూలై 2026న జారీ చేసిన నోటీసు ప్రకారం, గాజులరామారం సర్వే నంబర్ 329లో ప్రభుత్వ భూమిగా నమోదైన 283 చదరపు గజాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టినట్లు అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ భూమిని అనధికారికంగా ఆక్రమించుకున్నట్లు నివేదించబడిన నేపథ్యంలో, సంబంధిత వ్యక్తులు ఏడు రోజులలోపు వ్యక్తిగతంగా లేదా లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని అధికారులు ఆదేశించినప్పటికీ ఇంతవరకు వివరణ ఇచ్చినట్లు లేదు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే భూ ఆక్రమణల చట్టంలోని నిబంధనల ప్రకారం జరిమానా విధించడం, ఆక్రమణను తొలగించడం, స్థలంలోని భవనం, నిర్మాణ సామగ్రి లేదా ఇతర ఆస్తులను జప్తు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని నోటీసులో హెచ్చరించారు.

**అక్రమ నిర్మాణం పై చర్యలు ఉంటాయా?**

ఒకవైపు యూఎల్‌సీ, ప్రభుత్వ భూములపై ఆక్రమణ ఆరోపణలు.. మరోవైపు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటార న్నది ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వ భూముల రక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






## చుక్కల అమావాస్య 2026- దీనికి ఆ పేరు ఎలా వచ్చింది? పూజా విధానం, విశిష్టత గురించి తెలుసా?



హిందూ సంప్రదాయంలో అమావాస్య తిథికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా పితృదేవతలు తరించడానికి అమావాస్య అద్భుతమైన అవకాశం. అమావాస్య రోజున మరణించిన పూర్వీకులను స్మరించుకుంటూ తర్పణాలు నిర్వహిస్తారు. ఇలా చేయడం వల్ల పితృదేవతల ఆశీస్సులు, వంశాభివృద్ధి కలుగుతాయని గాఢమైన నమ్మకం ఉంది. ఒక ఏడాదిలో వచ్చే 12 అమావాస్యల్లో కొన్ని చాలా విశిష్టమైనవి. ఈ సందర్భంగా ఆషాఢ అమావాస్యకు చుక్కల అమావాస్య అనే పేరు ఎలా వచ్చింది? చుక్కల అమావాస్య విశిష్టత ఏంటి? అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

**చుక్కల అమావాస్య ఎప్పుడు?**

ఆషాఢ మాసం చివరి రోజు వచ్చే అమావాస్యను చుక్కల అమావాస్య అంటారు. ఈ ఏడాది ఆగస్టు 12, బుధవారం ఆషాఢ బహుళ అమావాస్య కాబట్టి ఈ రోజునే చుక్కల అమావాస్యగా జరుపుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. ఈ రోజున పితృదేవతలను స్మరించుకోవడం, గౌరీదేవిని పూజించడం, దీపపూజ చేయడం చాలా ముఖ్యం. దం ప్రారంభమయ్యే ఈ సమయంలో పెద్దలను తలచుకుని దానధర్మాలు చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నమ్ముతారు. ఈ సందం చుక్కల అమావాస్య విశిష్టత తెలుసుకుందాం.

**దక్షిణాయనంలో తొలి అమావాస్య**

తెలుగు పంచాంగం ప్రకారం పుష్యమాసంలో వచ్చే మకర సంక్రాంతికి ఎంతటి ప్రాధాన్యం ఉందో, ఆషాఢ మాసంలో వచ్చే కర్కాటక సంక్రాంతికి కూడా అంతే ప్రాధాన్యం ఉంటుంది. మకర సంక్రమణంతో ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమయితే, కర్కాటక సంక్రమణంతో దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమవుతుంది. పురాణాల ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో పితృదేవతలు మనకు సమీపంగా ఉంటారని తెలుస్తోంది. అందుకే దక్షిణాయన పుణ్యకాలంలో వచ్చే మొదటి అమావాస్య రోజున పితృదేవతలకు ఆహ్వానం పలుకుతూ వారికి తర్పణాలు నిర్వహించాలని శాస్త్రం చెబుతోంది.

**చుక్కల అమావాస్య పురాణ గాథ**

స్కంద పురాణంలో చుక్కల అమావాస్య గురించిన ప్రస్తావన ఉంది. ప్రధానంగా ఇది మహిళల పండుగ అని అంటారు. మంచి సంతానం కలగాలని, పిల్లలు వృద్ధిలోకి రావాలని, భర్త క్షేమంగా ఉండాలని కోరుతూ ముత్తయిదువలు గౌరీదేవిని ఆరాధిస్తారు. పెండ్లి కాని యువతులు, మంచి వరుణ్ని కోరుతూ అమ్మ వారిని దీపస్తంభం వ్రతంతో పూజిస్తారు. ఈ వ్రతం చేసేవారు సూర్యాస్తమయం వరకు నిష్ఠగా ఉపవాసం ఉంటారు. సాయంత్రం అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీపస్తంభాన్ని నిలిపి, దీపాలను వెలిగించి, ఆ వెలుగులో గౌరీదేవిని పూజించడం వ్రత నియమం.

**చుక్కల అమావాస్య పేరు ఇలా వచ్చింది!**

చుక్కల అమావాస్య వ్రతాన్ని మొదటిసారి ఆచరిస్తున్నవారు గౌరీదేవి అమ్మవారి సన్నిధిలో పాలు, చక్కెర కలిపి చేసిన వరిపిండితో వంద చుక్కలను వేసి, వంద పోగుల హారాన్ని ధరిస్తారు. వంద సున్నపు చుక్కలతో దీపస్తంభాన్ని అలంకరిస్తారు. ప్రతి సంవత్సరం వాటి సంఖ్యను పెంచుతూ ఐదేండ్లపాటు వ్రతాన్ని నిర్వహిస్తారు. చివరగా వెండితోగాని, బంగారంతోగాని చేసిన చుక్కలను దానంగా ఇచ్చి ఉద్యాపన చేసి, వ్రత సమాప్తి చేయాలని స్కాంద పురాణం చెబుతున్నది. దీపస్తంభానికి చుక్కలు పెట్టి పూజించే అమావాస్య కావడంతో, దీనికి చుక్కల అమావాస్య అనే పేరు వాడుకలోకి వచ్చింది.

**రైతుల పండుగ కూడా**

చుక్కల అమావాస్యను రైతుల పండుగగా కూడా జరుపుకుంటారు. ఆషాఢ అమావాస్య నాడు జరుపుకునే ఈ పర్వదినం సందర్భంగా రైతులు వానచుక్కలు కుంభవృష్టిగా మారి, వర్షాలు సమృద్ధిగా కురియాలని, పంట పొలాలు పచ్చగా పండాలని ప్రత్యేక పూజలు చేస్తారు.

దీపపూజఆషాఢ బహుళ అమావాస్య రోజు కొన్ని ప్రాంతాల్లో దీపపూజ విశేషంగా చేస్తారు. దక్షిణాయనంలో వాతావరణంలో మార్పులు జరిగి వర్షాలతో చలి, చీకటికాలం మొదలవుతుంది. ఇవి అజ్ఞానానికి, బద్ధకానికి సంకేతాలు. అందుకే చుక్కల అమావాస్య సందర్భంగా చీకటిని, అజ్ఞానాన్ని పారద్రోలే దీపపూజ చేయడం ఆనవాయితీ!

దీపపూజ విధానం

దీపపూజల్లో భాగంగా వెలుగును, వేడిని ఇచ్చే దీపాలను వెలిగించి దీపపూజ చేస్తారు. దీపపూజ చేయడం కోసం చెక్కతో చేసిన పీటలు శుభ్రంగా కడిగి, పసుపు కుంకుమలతో అలంకరించి వరి పిండితో ముగ్గులు వేస్తారు. ఈ పీటల మీద దీపాలను వెలిగించి, దీపాలను పసుపు కుంకుమలతో, అక్షింతలతో, పువ్వులతో పూజిస్తారు. సకల సౌభాగ్యాలు ప్రసాదించమని వేడుకుంటూ గౌరీదేవిని ఆహ్వానించి పూజిస్తారు. పులగం, పరమాన్నం వంటివి నివేదిస్తారు. ముఖ్యంగా ఒడిశా, బంగాల్ ప్రాంత ప్రజలు చుక్కల అమావాస్యను ఈ విధంగా జరుపుకుంటారు.

**పితృదేవతల ఆరాధన**

దక్షిణాదిన అమావాస్య అంటే పితృదేవతల ఆరాధనకు ప్రత్యేకమైన రోజు. ఈ రోజున గతించిన పితృదేవతలకు తర్పణాలు, శ్రాద్ధకర్మలు నిర్వహించడం వల్ల పితృ సంబంధిత దోషాలు తొలగి వంశాభివృద్ధి కలుగుతుందని స్కంద పురాణంలో వివరించి ఉంది. రానున్న చుక్కల అమావాస్య రోజు మనం కూడా పితృదేవతలను శాస్త్రోక్తంగా ఆరాధించి సద్గతులు పొందుదాం.

శుభం భూయాత్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

## మీ భర్తలో ఈ లక్షణాలు ఉన్నాయా? - జీవితాంతం వదులుకోవద్దట!



ప్రేమైనా, పెళ్లైనా.. నచ్చితే ముందుకెళ్లడం, నచ్చకపోతే విడిపోవడం ఈ తరం జంటలకు కామనైపోయింది. అయితే, ఇలా విడిపోయే క్రమంలో ఒకరి కోసం మరొకరు చేసిన మంచి పనులు, త్యాగాలు సైతం గుర్తుకు రావు. వాస్తవానికి, ఇలా ఆఖరి మెట్టు దిగే ముందు ఒక్కసారి వాటికి గుర్తుకు తెచ్చుకుంటే చాలా వరకు బ్రేకప్? లేదా విడాకులు తగ్గుతాయంట ంన్నారు నిపుణులు. భాగస్వామిలోని ఈ సానుకూలతల్ని అంగీకరించి.. కుదిరితే వారు చేసిన పొరపాట్లను క్షమించగలిగితే బంధాన్ని నిలుపుకోవచ్చని చెబుతున్నారు.

అంతకన్నా కావాల్సిందేముంది? : ప్రతి భర్త విజయం వెనుక భార్య ఉన్నట్లే.. ప్రతి భార్య విజయంలో భర్తదీ కీలక పాత్ర ఉంటుందట. ఈ క్రమంలో ఇంటా, బయటా వారు అందించే ప్రోత్సాహమే పరోక్షంగా భార్య ఉన్నతికి కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, అందరూ ఇలాగే ఉండాలనేమీ లేదట. కొందరు భార్య మాటలకు, వారు తీసుకునే నిర్ణయాలకు తగిన గౌరవం ఇవ్వకపోవచ్చుట. మరికొందరు కెరీర్ పరంగానూ వారిని నిరుత్సాహపరచచ్చుట. ఈ క్రమంలో మిమ్మల్ని ప్రతి విషయంలో ప్రోత్సహించే వ్యక్తి తోడుగా ఉన్నంత వరకు ఇక మీకు తిరుగుండదంటున్నారు నిపుణులు. అందుకే, పరిస్థితులు ఎలా ఉన్నా సరే, ఇలాంటి భర్తని వదులుకోకపోవడమే మంచిదని చెబుతున్నారు.

కోపాన్ని ఆపుకోలేక పిల్లలను కొడుతున్నారా? - ఇలా ట్రై చేయండి!

నువ్వు- నేను ఒకటే : “భార్యాభర్తలిద్దరూ ప్రతి విషయంలో సమానమే” అంటే కొంతమంది ఒప్పుకోరు. వారి కంటే తమ భాగస్వామి ఓ మెట్టు కిందే ఉండాలని, ఉద్యోగం చేసినా సంపాదనలోనూ తానే ఓ మెట్టు పైనుండాలని అనుకునే వారూ ఉంటారట. ఇలాంటి దంపతుల్లో సఖ్యత లేదా మానసిక ప్రశాంతత లోపిస్తుందంటున్నారు నిపుణులు. ఇదే వారి మధ్య గొడవలకు దారి తీస్తుందని చెబుతున్నారు. ఒకవేళ భార్యలు సర్దుకుపోయినా చాలామంది భర్తలు వారిపై అధిపత్యం ప్రదర్శిస్తుంటారట. ఇదిలా ఉంటే.. ప్రతి విషయంలోనూ భార్య తనతో సమానమేనన్న ధోరణి కొంతమంది భర్తల్లో కనిపిస్తుంటుందని తెలియజేస్తున్నారు. అలాంటి వారు ఇంటా - బయటా తన భార్యకు అన్ని విషయాల్లో తోడ్పటునందిస్తారని వివరిస్తున్నారు. ఈ పని భార్యలే చేయాలి.. ఇది పురుషులు చేయకూడదన్న నియమాలేవీ వారికి ఉండవట. ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్న చాలామంది మహిళలు.. తాము ఈ స్థాయికి చేరుకోవడానికి తమ భర్త అందించిన ప్రోత్సాహం, సమానత్వం కూడా ఓ కారణమని చెప్పడం చూస్తుంటాం. కాబట్టి, మీ భాగస్వామి కూడా ఎలాంటి భేషజాల్లేకుండా ఇలాంటి సమానత్వం చూపిస్తే.. మీరు అదృష్టవంతులన్నట్లే!నేనున్నాననీ.. నీకేం కాదనీ! : పెళ్లిలో వధూవరులు ఒకరికొకరు ప్రమాణాలు చేసుకోవడం అందరికీ తెలిసిందే! సుఖదుఃఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉంటానని ప్రమాణం చేసుకోవడం కూడా వీటిలో ఒకటి. అయితే, పెళ్లైన కొత్తలో కొన్నాళ్లు దీన్ని పాటించినా.. ఆ తర్వాత మాత్రం దీన్ని పూర్తిగా పక్కన పెట్టేసే వారూ లేకపోలేదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో భాగస్వామి సంతోషాల్లో పాలుపంచుకొని.. తనకు కష్టం వచ్చినప్పుడు వదిలేసే వారు కొందరుంటారట. వాస్తవానికి, ఇలాంటి వాళ్లు తోడుగా ఉన్నా లేకపోయినా ఒక్కటే అనిపిస్తుంటుందట. ఈ లోటే అనుబంధాలను దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, మీ భర్త ఇందుకు భిన్నం అని మీరు అనుకుంటే.. ‘సంతోషాల్లో తోడున్నట్లే బాధల్లోనూ ఓదార్పునిస్తాడు. తానున్నానన్న భరోసా కల్పిస్తాడని’ మీరు అనుకుంటే.. ఇలాంటి మంచి మనిషిని వదులుకోవద్దని సూచిస్తున్నారు.మిమ్మల్ని మీరుగా : పెళ్లయ్యాక తమ భాగస్వామి తమకు నచ్చినట్లుగా మారాలని చాలామంది అనుకుంటారు. అయితే, అవి ఎలాంటి మార్పులు అనేవే ఇక్కడ ముఖ్యమట. మిమ్మల్ని కట్టడి చేస్తున్నారా? లేదంటే మీ మంచికే ఆ మార్పు కోరుకుంటున్నారా? అనేది ఆలోచించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే, వ్యక్తిగతంగా- ఆర్థికంగా- వృత్తిపరంగా మీరు తీసుకునే ఏ నిర్ణయమైనా సరిగ్గా లేకపోతే సరిచేయడం కూడా మంచిదే! ఇలా మీకు తెలిసో, తెలియకో తప్పటడుగులు వేయకుండా జాగ్రత్త పడుతున్నారంటే.. మీ భర్తకు మీరంటే ఎంత ప్రేమో అర్థం చేసుకోవాలంటున్నారు నిపుణులు.ఇలా భార్యలే కాదు, భర్తలూ తమ భాగస్వామి మంచి మనసును అర్థం చేసుకోవాలట. ప్రతి విషయంలోనూ ప్రోత్సాహం అందించడం, వారితో పాటు ఇంటి బాధ్యతల్ని-వృత్తి బాధ్యతల్ని సమానంగా పంచుకోవడం, మీకంటూ కొన్ని విషయాల్లో ప్రైవసీ కల్పించడం, మిమ్మల్ని అమితంగా ప్రేమించడం.. ఇలాంటి వారిని అసలు విడిపెట్టవద్దని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమ జీవితాలను బ్యాలన్స్ చేసుకునే క్రమంలో ఇద్దరూ ఒకరికొకరు సహకరించుకుంటే.. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా ఆ సంసార నావ సాఫీగా ముందుకు సాగిపోతుందని పేర్కొంటున్నారు.

## శయనముద్రలో దర్శనమిచ్చే వేంకటేశ్వరస్వామి- ఆ ఆలయం విశేషాలు ఇవే!

వేంకటేశ్వరస్వామి కొండలపైనే ఎక్కువగా ఆవిర్భవిస్తూ ఉంటాడు. అయితే ఎక్కడ వెలసినా స్వామి విగ్రహం మాత్రం స్థానక మూర్తిగానే అంటే నిలుచున్న భంగిమలోనే దర్శనమిస్తుంది. కానీ ఒక క్షేత్రంలో వెలసిన వేంకటేశ్వర స్వామి చాలా ప్రత్యేకం. ఇక్కడ స్వామి శయనముద్రలో దర్శనమివ్వడం విశేషం. ఈ అరుదైన ఆలయం ఎక్కడుంది? ఆ విశేషాలేంటో ఈ కథనంలో తెలుసుకుందాం.

శయనముద్రలో శ్రీనివాసుడు

సహజంగా వేంకటేశ్వరస్వామి ప్రకృతి ప్రేమికుడిగా కనిపిస్తాడు. ఎందుకంటే స్వామి ఎప్పుడు పచ్చని కొండలపైనే ఎక్కువగా ఆవిర్భవిస్తూ ఉంటాడు. అలా స్వామివారు తిరుమల కాకుండా కొండపై వెలసిన మరో క్షేత్రమే ‘అమ్మపేట’. ఖమ్మం జిల్లా ముదిగొండ మండల పరిధిలో ఉండే అమ్మపేట క్షేత్రంలో శ్రీనివాసుడు శయనముద్రలో కొండపై వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ గ్రామంలోకి ప్రవేశించగానే దూరంగా కొండపై వెలసిన ఆలయం కనిపిస్తుంది.

అతి పెద్ద బండరాళ్ల సముదాయం

సాధారణంగా కొండ అంటే కొన్ని చిన్న చిన్న బండరాళ్ల సముదాయంగా ఉంటుంది. కానీ అమ్మపేటలో మాత్రం అతి పెద్ద బండరాళ్లు దర్శనమిస్తాయి. ఒకే చోట నిలుచుని ఒక బండరాయిని పూర్తిగా చూడలేం అంటే అవి ఎంత పెద్ద బండరాళ్లో అర్థం చేసుకోవచ్చు.

బండరాళ్ల నడుమ వెలసిన కోనేటిరాయడు

కొండపై భాగంలో ఒక పెద్ద బండరాయి వేదికగా, మరో పెద్ద బండరాయి పైకప్పుగా ఉంటే ఆ రెండింటి మధ్యలో వేంకటేశ్వరస్వామి శయనముద్రలో వెలసి ఉండడం విశేషం. ఇక్కడ వేంకటేశ్వర స్వామి వెలిగొండ వేంకటేశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. ఈ స్వామి స్వయంభువు అని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

స్థల పురాణం

కొన్ని వందల సంవత్సరాల క్రితం స్వామివారు ఒక భక్తుడికి స్వప్నంలో దర్శనమిచ్చి తన ఉనికిని తెలిపి, తానున్న ప్రదేశం ఆనవాళ్లను తెలియజేశాడంట! అలా ఇక్కడ స్వామివారు వెలుగులోకి వచ్చినట్లు ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

పురాణ ప్రాశస్త్యం

రామాయణం ప్రకారం సీతారాములు భద్రాచలం వెళ్తూ మార్గమధ్యంలో ఈ ప్రదేశంలో కొంతసేపు విశ్రమించారని తెలుస్తోంది. ఇందుకు నిదర్శనంగా ఇక్కడ సీతమ్మవారి పాదముద్రలు కూడా చూడవచ్చు. సీతమ్మ వారి పాదస్పర్శతో పునీతమైన ప్రదేశం



కాబట్టి ఈ క్షేత్రానికి ‘అమ్మపేట’ అని పేరు వచ్చిందని స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

ఆలయ విశేషాలు

కొండపైకి చేరుకోవడానికి మెట్ల మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. మెట్లు ఎక్కేటప్పుడు రెండువైపులా ఆధారం కోసం ఎవరో పేర్చినట్లుగా బండరాళ్లు ఉండడం విశేషం. ఇది భగవంతుని లీలావిశేషమే అని స్థానికులు భక్తిపారవశ్యంతో చెబుతారు. చుట్టూ పంట పొలాల మధ్య ఎవరో తెచ్చి పెట్టినట్లుగా ఉండే ఈ కొండ ప్రత్యేకంగా ఉంటుంది. దూరం నుంచి పరిశీలనగా చూస్తే ఈ కొండ ఏనుగు ఆకారంలో ఉంటుంది. సరిగ్గా ఏనుగు తల పైభాగంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వెలసి ఉండడం విశేషం. శ్రీనివాసుని శిరస్సున మోస్తున్న గజేంద్రుని వలే ఈ కొండ దర్శనమిస్తుంది.

శయనముద్రలో శ్రీనివాసుడు

కొండపై రెండు బండరాళ్ల మధ్యలో ఉన్న గర్భాలయంలో వేంకటేశ్వర స్వామి శయన భంగిమలో దర్శనమిస్తాడు. అలసిపోయి సేదదీరుతున్నట్టుగా ఈ స్వామి కనిపిస్తాడు. అనంతపద్మనాభస్వామి మాదిరిగా వేంకటేశ్వరస్వామి వెల్లకిల పడుకుని ఉండటం ఇక్కడి విశేషం. శయనముద్రలో ఉన్న వేంకటేశ్వర స్వామి మూర్తి 6 అడుగులకు పైనే ఉంటుంది. రెండు కొండరాళ్ల మధ్య వెలసిన స్వామిని దర్శించుకోవాలంటే భక్తులు వంగుతూ లోపలకు వెళ్లాల్సి ఉంటుంది. అర్చక స్వాములు కూడా బండరాళ్ల మధ్యలో నుంచి దూరి వెళ్లి నిత్యపూజలు నిర్వహిస్తుంటారు. అయితే స్వామివారు శయనించిన ప్రదేశం మాత్రం ఇరుకుగా లేకుండా విశాలంగా ఉంటుంది. తులసి మాలలతో స్వామి వారికి నిత్యం చేసే అలంకారం మనోహరంగా ఉంటుంది.

శ్రీనివాసుని విహారం కోసం విమానం

ఈ కొండ పైభాగంలో ఒక వైపున పొడవైన బండరాయి ‘విమానం’ ఆకారంలో కనిపిస్తుంది. దీనిపైనే స్వామివారు ముల్లోకాలు విహరిస్తూ ఉంటారని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇతర విశేషాలు

కొండ దిగువున స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించే మండపం ఉంటుంది. మరోవైపు స్వామి పుష్కరిణి ఉంటుంది. స్వామి వారి పూజలకు, అభిషేకాలకు ఈ తీర్థ జలాన్నే వినియోగిస్తారు.

పూజోత్సవాలు

శయన శ్రీనివాసునికి నిత్య నైమిత్తిక పూజలు ఆగమ శాస్త్రానుసారం గా జరుగుతాయి. ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు స్వామివారి కళ్యాణం వైభవంగా జరుగుతుంది. అలాగే రథసప్తమి రోజు తిరుమల తరహాలో స్వామివారికి ప్రత్యేక సేవలు జరుగుతాయి. ఈ సమయంలో చుట్టపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ధన్యులవుతారు.

శుభకరం ఈ దర్శనం

అమ్మపేట శయన శ్రీనివాసుని దర్శించుకోవడం వలన సకల శుభాలు చేకూరుతాయని విశ్వాసం. మనం కూడా అమ్మపేట శయన శ్రీనివాసుని దర్శించుకుందాం... సకల శుభాలు పొందుదాం. ఓం నమో వేంకటేశాయ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న

## చర్మం, జుట్టు సమస్యలకు ‘జామాకులు’ చెక్ - ఎలా వాడాలో తెలుసా?



జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అయితే, జామాకుల వల్ల కూడా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటితో చర్మ, జుట్టు సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చని అంటున్నారు. మొటిమల నివారణకు : మొటిమల సమస్యతో బాధపడే వారికి జామాకు చక్కటి పరిష్కారం చూపుతుంది. ఇందులో యాంటీసెప్టిక్ గుణాలు అధికంగా ఉంటాయట. అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాను నశింపజేస్తుందని నిపుణులు అంటున్నారు. ఈ క్రమంలో జామాకులతో చేసిన పేస్ట్?ని మొటిమల దగ్గర అప్లై చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చక్కటి ఫలితం ఉంటుందట. జామ ఆకులలో టానిన్లు, సపోనిన్లు, టెర్పెనాయిడ్లు, ఆల్కలాయిడ్లు, ఫినాల్ భాగాలు ఉండటం వాటి యాంటీబాక్టీరియల్ లక్షణాలను సూచిస్తుంది, ఇవి మొటిమల చికిత్సకు సహాయపడతాయని పేర్కొంది.బ్లాక్?హెడ్స్ పోవాలంటే : ప్రస్తుతం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్యల్లో బ్లాక్?హెడ్స్? ఒకటి. వీటిని జామాకు, కలబందతో నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. దీని కోసం ఒక టేబుల్? స్పూన్ జామాకు పేస్ట్?ని తీసుకోవాలి. దానికి అంతే మొత్తంలో కలబంద గుజ్జు, చిటికెడు పసుపుని కలుపుకోవాలి. ఇలా కలపగా వచ్చిన మిశ్రమాన్ని బ్లాక్?హెడ్స్? పైనా రాయాలి. ఇలా 20 నిమిషాల పాటు ఆరనిచ్చిన తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.జుట్టు ఆరోగ్యంగా : జామాకుల్లో విటమిన్ ‘సి’ ఉంటుంది. ఇది శరీరంలో కొలాజెన్ ఉత్పత్తిని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, జుట్టు ఆరోగ్యంగా, ఒత్తుగా పెరుగుతుంది. ఈ ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ గుణాలు వెంట్రుకలు డ్యామేజ్ కాకుండా రక్షిస్తాయి.సిల్కీ హెయిర్ కోసం : గిన్నెలో లీటరు నీటిని పోసి వేడి చేయాలి. ఇందులో బాగా శుభ్రం చేసిన జామాకులు వేసి 20 నిమిషాల పాటు మరిగించాలి. దీన్ని చల్లారనిచ్చి మరో గిన్నెలోకి వడకట్టుకోవాలి. ఈ మిశ్రమం హెయిర్? చెబుతున్నారు. గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేసిన తర్వాత జుట్టు బాగా ఆరనివ్వాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు అప్లై చేసుకోవాలి. అలాగే, కుదుళ్లకు పట్టేలా 10 నిమిషాల పాటు మర్దన చేసుకోవాలి. ఇలా కొద్దిసేపు ఉంచుకొని తర్వాత గోరువెచ్చని నీటితో జుట్టును కడిగేస్తే చక్కటి ఫలితం ఉంటుంది. జామ ఆకుల హెయిర్ మాస్క్ కుదుళ్లను బలోపేతం చేస్తుంది, హెయిర్?ఫాల్?ను? తగ్గిస్తుంది, జుట్టు మరింత మెరుస్తూ, మృదువుగా కనిపించేలా చేస్తుందని పేర్కొంది.చుండ్రుకు చెక్ : ఒత్తిడి, కాలుష్యం కారణంగా చాలామంది ఎదుర్కొంటోన్న సమస్యల్లో చుండ్రు ఒకటి. దీనివల్ల దురదతో పాటు జుట్టు బాగా రాలిపోతుంది. జామాకులతో తయారు చేసుకున్న హెయిర్? ప్యాక్? ఈ విషయంలో మంచి ఫలితాన్ని ఇస్తుందని నిపుణులు అంటున్నారు. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.అయితే ఇది సహజసిద్ధమైన చిట్కానే అయినా ఒకసారి ప్యాచ్? టెస్ట్ చేసుకుని ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించుకున్న తర్వాతే వీటిని వాడడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే, వాడే ముందు జామాకులను దుమ్ము లేకుండా చక్కగా శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# "అనే నేను" కార్యక్రమంలో భాగస్వాములు కండి

- స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సన్నద్ధం కావాలి
- యువత దేశభక్తితో ముందుకు సాగాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్






**విజయనగరం, ఆగస్టు 12**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "అనే నేను" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు యువత సన్నద్ధం కావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం విజన్ 2047, రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ లకు అనుగుణంగా దేశ ప్రజలంతా ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో దేశభక్తిని చాటి చెప్పేందుకు నీ దృష్టిలో భారతదేశం ఎలా ఉండాలి?దేశ అభివృద్ధి కోసం నువ్వు ఏం చేయాలనుకుం టున్నావు ? 60 సెకండ్ల వీడియో సెల్ఫీ వీడియోను పేజీని ట్యాగ్ చేయాలని, తో పోస్ట్ చేయాలన్నారు. మీరు ఇచ్చిన సందేశాత్మక మైన ఆలోచన వీడియో చూసి ఇతరులలో స్ఫూర్తి నింపే విధంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. చైతన్య వంతంగా ఆలోచన చేసే యువకులు ఆలోచన నేడు దేశానికి ఎంతో అవసరమని, యువత దేశభక్తితో ముందుకు సాగాలని కోరుతూ, మీకు వచ్చిన ఆలోచన చిన్నదైనా... దేశ భవిష్యత్తుకు అది పెద్ద అడుగు కావచ్చునీ, అందుకే సోషల్ మీడియా ద్వారా చైతన్యపరిచే విధంగా వీడియో చేసి ట్యాగ్ చేయాలన్నారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా నాడు స్వాతంత్రాన్ని పొందామని, స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్న మనమంతా ఒకటే అనే భావనతో, ప్రతి ఇంటా మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడిస్తూ, యువత స్వాతంత్ర దినోత్సవం వేడుకలలో పాల్గొనాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# చట్టాల గురించి యువతకు అవగాహన ఉండాలి

- కామవరపుకోట జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ యువజన దినోత్సవ సదస్సు
- ముఖ్య అతిథిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి

**కామవరపుకోట :** చట్టాల గురించి యువత అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎన్. శ్రీలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కామవరపుకోటలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్, సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ చట్టం గురించి యువతకు తెలియాలనే అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుత మారుతున్న సమాజంలో యువత సోషల్ మీడియా వేదికలకు, ప్రేమలకు ఆకర్షితులు కాకుండా ఉంటూ చదువుతో పాటు భవిష్యత్తు పట్ల ఒక స్పష్టమైన లక్ష్యం కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే యువత ఎలాంటి కేసుల్లోనూ చిక్కుకోకూడదని.. అలాగే డ్రగ్స్, ర్యాగింగ్ లాంటి పెడధోరణులకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినిలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయంలో అవగాహన కలిగి ఉండడంతో పాటు తమను ఎవ్వరూ ఇబ్బంది పెడుతున్నా, వేధిస్తున్నా ధైర్యంగా తల్లిదండ్రులు లేదా పోలీసులకు తెలియజేయాలన్నారు. అలాగే కోర్టు కేసుల్లో ఎవరో ఒకరు విజయం సాధిస్తే.. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుంటే ఇరు పార్టీలు గెలిచినట్లే అవుతుందన్నారు. అలాగే విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి జడ్జిల విధుల గురించి వివరించారు. తడికలపూడి ఎస్.ఐ వల్లి పద్మ మాట్లాడుతూ యువత సైబర్ క్రైం, డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాలో చెడు వీడియోలకు ఎడిక్ట్ కాకూడదని.. సోషల్ మీడియా వల్ల మంచి, చెడు రెండూ ఉన్నాయని.. మంచికి మాత్రమే దానిని ఉపయోగించాలన్నారు. యుక్త వయస్సులో చెడు స్నేహాలు, ప్రేమలు, ఆకర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే కొన్ని హెల్ప్‌లైన్ నెంబర్ల గురించి ఎస్.ఐ విద్యార్థులకు వివరించారు. గంజాయి రవాణా - 1976 , ఫైనాన్షియల్ సైబర్ క్రైం - 1930, పోలీస్ హెల్ప్‌లైన్ - 112, చైల్డ్ హెల్ప్‌లైన్ - 1098 నెంబర్లకు ఫోన్ చేస్తే ఆపద నుంచి రక్షించుకోవచ్చన్నారు. సీనియర్ అడ్వకేట్, మాస్టర్ ట్రైనర్ పి. రత్నరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి సమాన తెలివితేటలే ఉంటాయని.. ఎవరు అయితే ఎక్కువ కష్టపడి జ్ఞానం పెంచుకుంటారో వారే మంచి అవకాశాలు అందిపుచ్చుకుంటారన్నారు. లోక్ అదాలత్ ఉచిత న్యాయ సలహాల కోసం 15100 హెల్ప్ లైన్ నెంబర్లో సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, పీఆర్వో అహ్మద్, కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్. వేణుగోపాల్, ఎన్. ఉత్తమ్ గోపాల్, చింతలపూడి బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తమ్మిశెట్టి నాగేంద్ర ఫణీదీప్, పీఎల్‌వీస్ వీరమళ్ల మధు, నిజావరపు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతికి ఏపీ సరికొత్త అడుగులు

- చెన్నై, కోయంబత్తూర్ సదస్సుల్లో పెట్టుబడుల వెల్లువ
- ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి
- CII పార్టనర్‌షిప్ సమిట్‌కు అంతా సానుకూలం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్







**అమరావతి, ఆగస్టు 12 :** " CII పార్టనర్‌షిప్ సమిట్ 2026 'కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' భాగస్వామ్యంతో.. ఏపీఈడీబీ సమన్వయంతో చెన్నై, కోయంబత్తూర్‌లో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో విజయవంతమైనట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొనగా రాష్ట్రంలో విస్తృత పెట్టుబడి అవకాశాలను ప్రభుత్వ బృందం సవివరంగా ప్రదర్శించింది. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రగతిశీల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సమృద్ధిగా ఉన్న సహజ వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక వసతులు, వ్యూహాత్మక పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు మరియు పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో సాగుతున్న సుపరిపాలన వేగవంతమైన వ్యాపార ప్రక్రియలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు వివరించారు. రాష్ట్రంలో విభిన్న రంగాల్లో ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా పరిశ్రమలు, పెట్టుబడిదారులను ఆహ్వానించిన మంత్రి, పరస్పర ప్రయోజనకర భాగస్వామ్యాల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చారు.ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌తో తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవడం, రాష్ట్రంలో ఆకర్షణీయమైన పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని మంత్రి తెలిపారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్టర్, ఇండో-జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎన్. పద్మనాభన్, ఇసుజు చెన్నై డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ హ్యూ, పోస్కో చెన్నై ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ మిస్టర్ జంగ్ ఉంగ్ కాంగ్‌తో చర్చలు జరపడంతో పాటు సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి మరియు మీడియా రంగాలలో ఉన్న అవకాశాలపై చర్చలు సాగినట్లు మంత్రి తెలిపారు.బుధవారం కోయంబత్తూర్‌లో జరిగిన సదస్సులో గోల్డ్ రిఫైనరీ, దీని ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి లభించే అవకాశాలపై ఎమరాల్డ్ జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ కె. శ్రీనివాసన్ గారితో చర్చించినట్లు మంత్రి తెలిపారు. అలాగే లీప్ గ్రీన్ ఎనర్జీ దేవానంద్ తో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి, జియాన్ ఛార్జింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ పళనిస్వామి, ఎం.ఎం. బాలకృష్ణన్ & బ్రోస్ డైరెక్టర్ మిస్టర్ రాజీవ్ పార్థసారథి, తిరుప్పూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్. తిరుక్కుమరన్, సీగర్ గ్రూప్ ఎండీ రాధాకృష్ణన్‌తో చర్చలు విజయవంతమైనట్లు మంత్రి తెలిపారు. ఈ సదస్సుల్లో పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇండస్ట్రీస్, టూరిజం & హాస్పిటాలిటీ, తయారీ రంగం, పారిశ్రామిక క్లస్టర్లు, పోర్టులు, లాజిస్టిక్స్ మరియు ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఉన్న విస్తృత అవకాశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వివరించామని మంత్రి చెప్పారు. ఈ యేడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న CII పార్టనర్‌షిప్ సమిట్ 2026 కు ఈ చెన్నై-కోయంబత్తూర్ సదస్సుల్లో ఎంతో సానుకూల స్పందన లభించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ఆసక్తిని వాస్తవ పెట్టుబడులుగా మార్చడానికి వేగవంతమైన అనుమతులు, ప్రాజెక్టుల పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో CII ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. సాంబశివరావు, CII చెన్నై ఛైర్మన్ ఆర్.వి. చారి, కోయంబత్తూర్ జోన్ CII ఛైర్మన్ వి. నౌషాద్, వైస్ ఛైర్మన్ మహాలింగం రామస్వామి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- 2026లో ఎన్టీఆర్ జిల్లాలో గణనీయంగా తగ్గిన డెంగ్యూ, మలేరియా కేసులు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ





**విజయవాడ: ఆగస్టు 12, 2026.**
విజయవాడ కలెక్టర్ కార్యాలయం నుండి బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సీజనల్ వ్యాధుల నియంత్రణపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, 2025తో పోలిస్తే 2026లో ఎన్టీఆర్ జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. 2025లో 23 డెంగ్యూ, 41 మలేరియా కేసులు నమోదుకాగా, 2026లో ఇప్పటివరకు 2 డెంగ్యూ, 3 మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. కేసులు తగ్గినప్పటికీ వ్యాధులపై నిఘా, దోమల నియంత్రణ చర్యల్లో నిర్లక్ష్యం చేయరాదని అధికారులను ఆదేశించారు. జక్కంపూడి కాలనీలో అధిక జనసాంద్రత, బుడమేరు కాలువ సమీపం, వ్యవసాయ ప్రాంతాల కారణంగా దోమల వృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నందున ప్రత్యేక నిఘా, దోమల లార్వా నియంత్రణ, వ్యాధి నిర్ధారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి వారం ఒక ప్రయోగశాల సాంకేతిక నిపుణుడిని మార్పిడి పద్ధతిలో కేటాయించాలని ఆదేశించారు. అధిక ప్రమాద ప్రాంతాల్లో జ్వరాలపై విస్తృత నిఘా చేపట్టి, ప్రతి జ్వర కేసుకు సకాలంలో రక్త పరీక్షలు, వేగవంతమైన నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా కేసులు నిర్ధారణైతే వెంటనే చికిత్స, తదుపరి పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. నిలిచిన నీరు, పూడుకుపోయిన కాలువలు, మురుగు కాలువలు, ఖాళీ స్థలాలు, నీటి నిల్వ పాత్రలను నిరంతరం తనిఖీ చేసి శుభ్రం చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట దోమల లార్వా నియంత్రణ, పొగమందు పిచికారీ, క్రిమిసంహారక పిచికారీ చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని బలోపేతం చేసి ఇంటింటి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ(ఎఫ్)లు, ఆశా కార్యకర్తలు, స్వచ్ఛంద కార్యకర్తలు, పారిశుద్ధ్య సిబ్బంది, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడం, దోమల వృద్ధి ప్రదేశాలను తొలగించడంలో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. డిజిటల్ వేదికల ద్వారా దోమల వృద్ధి ప్రదేశాలు, అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి క్షేత్రస్థాయి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, యనమలకుదురు, జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, ఎన్టీఆర్ లంక, నదీతీర, కొండ, లోతట్టు ప్రాంతాలు, కాలువల పరిసరాల్లో ప్రత్యేక నిఘా, దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రులు, వైద్యశాలలు, ప్రయోగశాలలు డెంగ్యూ కేసులను జిల్లా వ్యాధి నిఘా వ్యవస్థకు సకాలంలో నివేదించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూలై--అక్టోబర్ 2026లో అన్ని శాఖలు సమన్వయంతో వర్షాకాల ముందస్తు కార్యాచరణ ప్రణాళికను అమలు చేసి వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని కలెక్టర్ సూచించారు. వ్యాధుల నిఘా, ముందస్తు నిర్ధారణ, చికిత్స, దోమల నియంత్రణ, పర్యావరణ పారిశుద్ధ్యం, ప్రజల భాగస్వామ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, డీఎంహెచ్ఓ శ్రవణ్ కుమార్, జిల్లా మలేరియా అధికారి డి. రాజు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విత్తనం నాటిన ప్రతి రైతుకు ఫసల్ బీమా

- రైతుల ఆర్థిక భద్రతకు 100 శాతం ఫసల్ బీమా నమోదు
- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద విత్తనం నాటిన ప్రతి రైతును పంటల బీమా పరిధిలోకి తీసుకురావాలి
- జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ





**విజయవాడ: ఆగస్టు 12.2026**
విజయవాడ కలెక్టరేట్ నుండి కలెక్టర్ లక్ష్మీశ.. జిల్లా రెవిన్యూ అధికారి యం.లక్ష్మీ నరసింహం, జిల్లాస్థాయి అధికారులతో కలసి కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీతో ఫసల్ బీమా నమోదు గడువు ముగియనున్నందున జిల్లాలో 100 శాతం నమోదు లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో పంట మార్పిడిపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, రైతులు చేపట్టిన పంట మార్పిడి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 6,800 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎరువుల దుకాణాల వద్ద కలెక్టరేట్ యూనిఫైడ్ కాల్ సెంటర్ 91549 70454 హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రదర్శించాలని సూచించారు. వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రతి రైతుకు సీడ్ సెల్లింగ్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో మొలక శాతం మెరుగుపడేందుకు ఇది దోహదపడుతుందని, రైతులకు అవసరమైన శిక్షణ అందించాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచేందుకు తహసీల్దార్లు, ఎంపీడీవోల సమన్వయంతో ఫారం పాండ్స్ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. 1.30 లక్షల లక్ష్యంలో వచ్చే ఏడాదికి 65 వేల కొత్త ఫారం పాండ్లను పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని, అంటువ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు, క్లోరినేషన్ కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆదర్శ గ్రామ యోజనలో టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తిచేసి పనులను వెంటనే ప్రారంభించాలని, కలెక్టర్ తదుపరి సమీక్ష నాటికి 50 శాతానికి పైగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, టాయిలెట్లు, ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని, వారంలోగా స్పష్టమైన పురోగతి సాధించాలని ఆదేశించారు. అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలకు ట్యాప్ కనెక్షన్లు ఉన్నట్లు ఎంపీడీవోలు, పంచాయతీల నుంచి అండర్‌టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నెట్ జీరో లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వరద పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధత, 22A దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కూడా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేసి జిల్లాను రాష్ట్రంలో ముందంజలో నిలపాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.జూమ్ కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజనల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హోమ్ గార్డ్స్ అందరికి వింటర్ జాకెట్స్ పంపిణీ




**హైద్రాబాద్ :** హైద్రాబాద్ కమిషనరేట్ లో పని చేస్తున్న హోమ్ గార్డ్ సోదర సోదరి మనులకు ఈ రోజు హైద్రాబాద్ సిటీ హెడ్ క్వాటర్స్ నందు గౌరవ శ్రీ వెంకటేశ్వర్లు డీసీపీ హెడ్ క్వాటర్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో హైద్రాబాద్ కమిషనరేట్ లో పని చేస్తున్న హోమ్ గార్డ్స్ అందరికి వింటర్ జాకెట్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్య క్రమంలో హేడ్ క్వాటర్ డీసీపీ వెంకటేశ్వర్లు సార్, అడిషనల్ డీసీపీ సిటీ కమాండెంట్ శ్రీ కిష్టయ్య సార్ ఏసిపి కృష్ణ సార్ ఏసిపి రవి సార్ ఆర్ ఐ వెల్ఫేర్ సి నరసింహా గౌడ్ సార్ మరియు తెలంగాణ హోమ్ గార్డ్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి సీనియర్ హోమ్ గార్డ్ రాజేందర్ , జగన్ ,మహిళ హోమ్ గార్డ్స్ సోదరి మణులు తదితర మిత్రులు పాల్గొనడం జరిగింది

# అంబేద్కర్ అమర సందేశం..!

పార్టు...5
మీ చేతిలోని కలంతో
ఒక కొత్త చరిత్రను చెక్కండి
ఒక శిలాశాసనం లిఖించండి
మీ గుండెలోని జ్ఞానజ్యోతితో
చీకటి యుగాలను దహించి వేయండి...!
మీ శిరసులు వంచకండి...
మీ హక్కుల్ని వదులుకోకండి...
నీ ఆత్మగౌరవాన్ని అమ్ముకోకండి...!
జ్ఞానాన్ని వజ్రాయుధంగా చేసుకోండి...
మీలోని సఖ్యతను ఐక్యతను
బలమైన బంధాన్ని కవచంగా ధరించండి
సమానత్వపు జెండాను ఎగురవేయండి
ఆత్మగౌరవమే శ్వాసగా స్వేచ్ఛగా హాయిగా
గర్వంగా ప్రశాంతంగా జీవించండి
ఇదే...తరతరాల సంకెళ్లను
తెంచిన ఆ మహా మహర్షి
బోధించిన అమర అగ్ని సందేశం...
భోదించు...సమీకరించు..
ప్రతిఘటించు...పోరాడు...!
ఎందుకంటే---
పోరాడితే పోయేదేముంది చెప్పండి.?
తరతరాల మీ బానిసత్వపు సంకెళ్లు
తప్పు...!...అన్న
అపరమేధావి అమరజీవి
రాజ్యాంగ నిర్మాత భారత రత్న
డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్
అమర అమృత అక్షర సందేశాన్ని
గుర్తుంచుకోండి నిత్యం మీ గుండెల్లో...
జై భీమ్ జయహో అంబేద్కరా జయహో



రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

# గంజాయి రహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లా

● గంజాయి సాగు, రవాణా, వినియోగంపై ఉక్కుపాదం
● గంజాయి సమాచారం అందిస్తే బహుమతి వివరాలు పూర్తిగా గోప్యం
● ఈగల్ ఛాలెంజ్‌లో భాగంగా 1972కు సమాచారం అందించండి
● విజయవాడ అంటే 'బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్' అనే నానుడికి స్వస్తి పలకాలని హితువు
● గంజాయి సేవించారనే నిర్ధారణ లేకుండా ఎలాంటి సంఘటనలనూ గంజాయితో ముడిపెట్టవద్దు



**విజయవాడ: ఆగస్టు 12,2026.**
ఎన్టీఆర్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో నిరంతరాయంగా కృషి చేసి గణనీయమైన ఫలితాలను సాధించామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు.జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం ఎన్‌కార్డ్, నషా ముక్త్ భారత్ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షత వహించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, డీసీపీ అడ్మిన్ కె.వి.జి.సరిత, ఈగల్ అధికారి రవీంద్ర, జిల్లా వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి వి.కామరాజు, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.విజయవాడకు సంబంధించి 'గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్' అనే నానుడి ఇకపై వినిపించకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. గంజాయి నిర్మూలనకు ఇప్పటికే 'డ్రగ్స్‌పై దండయాత్ర 1.1', 'డ్రగ్స్‌పై దండయాత్ర 2.0' వంటి కార్యక్రమాలను చేపట్టి జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన, నియంత్రణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ఎవరికైనా గంజాయి సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. గంజాయి కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్, పోలీస్ కమిషనర్ తెలిపారు. సమాచారం వాస్తవమని నిర్ధారణ అయితే నిబంధనల మేరకు తగిన బహుమతి అందజేస్తామని ప్రకటించారు.'ఈగల్ ఛాలెంజ్'లో భాగంగా 1972కు సమాచారం అందించి బహుమతి పొందవచ్చు అని వారు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ వద్ద ఉన్న సమాచారాన్ని అధికారులకు అందించాలని కోరారు. ప్రమాదాలకు కారణమైన వారు, కొట్లాటలకు దిగిన వారు గంజాయి సేవించారనే ప్రచారంలో వాస్తవం లేదని అధికారులు స్పష్టం చేశారు. అనేక సందర్భాల్లో సంఘటనలకు కారణమైన వ్యక్తులు మద్యం సేవించి ఉన్నట్లు గుర్తిస్తున్నామని, కేవలం అనుమానం ఆధారంగా ప్రతి సంఘటనను గంజాయి వినియోగంతో ముడిపెట్టడం సరికాదన్నారు. ఏదైనా సంఘటనలో గంజాయి సేవించారా లేదా అనే విషయాన్ని శాస్త్రీయ పరీక్షల ద్వారా నిర్ధారించిన తరువాత మాత్రమే దానిపై మాట్లాడాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లాలో గంజాయి నియంత్రణకు సంబంధించి 100 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అమలు చేస్తున్న గంజాయి నిరోధక విధానాలను ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు కూడా మోడల్‌గా తీసుకుని అమలు చేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్--ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గతంలో గంజాయి సాగు జరుగుతున్న సుమారు 9 వేల ఎకరాలను ప్రభుత్వం పూర్తిగా నియంత్రించిందని పోలీస్ కమిషనర్ తెలిపారు. గంజాయి సాగును గుర్తించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్లను విస్తృతంగా వినియోగించినట్లు వివరించారు. ప్రస్తుతం ఒక్క ఎకరంలో కూడా గంజాయి సాగు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గత రెండు విడతల్లో నిర్వహించిన గంజాయి నిరోధక కార్యక్రమాల్లో భాగంగా 1,287 మందిని పాజిటివ్ కేసులుగా గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. మూడు నెలల అనంతరం వారిలో 840 మందికి తిరిగి పరీక్షలు నిర్వహించగా, 559 మందికి సంబంధించిన రిపోర్టులు అందినట్లు వివరించారు. గతంలో ఎక్కువ మోతాదులో గంజాయి సేవించిన వారి శరీరంలో దాని ఆనవాళ్లు పూర్తిగా తొలగిపోవడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు కూడా పట్టవచ్చని తెలిపారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు పరీక్షల ద్వారా నిర్ధారణ అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. నిబంధనల మేరకు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఏ కార్యక్రమమైనా విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా కుటుంబాలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై యువతలో మరింత అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల నిరోధక ప్రచారంలో భాగంగా మూడో విడతగా 'ఈగల్ 1972' పేరుతో ప్రచార కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు అధికారులకు చేరవేయాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, సమాచారం ఆధారంగా చర్యలు తీసుకుని అది వాస్తవమని తేలితే తగిన బహుమతి అందజేస్తామని తెలిపారు.సమావేశంలో 'ఈగల్ 1972' కార్యక్రమానికి సంబంధించిన ప్రదర్శనతో పాటు, 'సే నో టు డ్రగ్స్' గోడపత్రికను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు సంయుక్తంగా ఆవిష్కరించారు.సమావేశానికి హాజరైన అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర భాగస్వాములతో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ప్రతిజ్ఞ చేయించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా సమాజంలో అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డీసీపీ అడ్మిన్ కె.వి.జి.సరిత, ఎన్టీఆర్ జిల్లా ఈగల్ అధికారి రవీంద్ర, జిల్లా వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి వి.కామరాజు, హెల్త్ కేర్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఆకాష్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ శంకర్, వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లిథియం, గాలియం నిక్షేపాల అన్వేషణపై ఎన్జీఆర్ఐతో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ




**అమరావతి, ఆగస్టు 12 :** లిథియం, గాలియం నిక్షేపాల అన్వేషణపై ఎన్జీఆర్ఐతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ( ఎంఓయూ కుదుర్చుకుంది. ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్‌తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఈ ఒప్పందం జరిగింది. ఏపీలో కీలక ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్ పరిధిలోని వేంపల్లె పరిసరాల్లో లిథియం, గాలియం ఖనిజాల నిక్షేపాలపై విస్తృత స్థాయి అన్వేషణకు చర్యలు చేపడుతుంది.ఈ మేరకు సీఎస్ఐఆర్--నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), రాష్ట్ర గనులు--భూగర్భశాస్త్ర శాఖల మధ్య ఎంఓయూ జరిగింది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్ఐ- ఏపీ ప్రభుత్వం ఈరోజు (బుధవారం) ఒప్పందం చేసుకున్నాయి. తుమ్మలపల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించారు. లిథియం గరిష్ఠంగా 1,000 పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు అంచనా వేశారు.ఈ విషయంపై మరింత అధ్యయనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి వందశాతం నిధులతో... రూ.140 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు ఏపీలోని గనుల రంగంలో పరిశోధన, టెక్నాలజీ, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలకు సంబంధించి ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్--టెక్స్‌మిన్, గనుల శాఖ మధ్య సీఎం సమక్షంలో మరో ఎంఓయూ కుదిరింది. దీని ద్వారా రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేసింది.

# అవగాహనతో ఎయిడ్స్‌ను జయిద్దాం

● ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
● హెచ్ఐవీని నియంత్రించడంలో క్రమం తప్పకుండా మందుల వినియోగం కీలకం
● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ










**విజయవాడ: ఆగస్టు 12,2026.**
హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యపరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అవగాహన, అప్రమత్తత, సకాలంలో వైద్య పరీక్షలు, క్రమం తప్పకుండా మందుల వినియోగంతో హెచ్ఐవీని సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు.హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ర్యాలీని ప్రారంభించడంతో పాటు స్వయంగా పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హెచ్ఐవీ నివారణ, నియంత్రణ, చికిత్స, ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు, ప్లకార్డులతో చైతన్యపరిచారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, ఎయిడ్స్‌పై సరైన అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. హెచ్ఐవీ పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, శాస్త్రీయమైన సమాచారాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వ్యక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు, మందులను వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా వినియోగిస్తే హెచ్ఐవీని నియంత్రణలో ఉంచుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. హెచ్ఐవీపై అనుమానం ఉన్నవారు లేదా ప్రమాదకర పరిస్థితులకు గురైన వారు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. హెచ్ఐవీ నిర్ధారణ అయితే వైద్యుల సలహా మేరకు చికిత్స పొందుతూ మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.స్మరణ రాజ్ మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, వారిపట్ల వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో అవగాహన కార్యక్రమాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ముఖ్యంగా యువతకు సరైన సమాచారం అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణపై బాధ్యతను పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా వైద్య నిపుణుల సూచనలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రవణ్ బాబు, అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ భాను నాయక్, ఐఈసీ జేడీ మంజుల, నర్సింగ్ విద్యార్థినులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పాల్గొన్నారు.

# కుల్‌దీప్‌కు తుది జట్టులో స్థిరత్వం కల్పించాలి



## ●టీమిండియా

## మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ సూచన

భారత స్టార్ చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా ఉపయోగించుకోవట్లేదనే ఆందోళన మాజీ క్రికెటర్లలో తీవ్రమవుతోంది. 15 మందిలో ఉంటున్నప్పటికీ అతడికి తుది జట్టులో మాత్రం ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌లోనూ అతడు బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు కుల్‌దీప్‌ను ఉద్దేశించి.. టీమిండియా మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ, ద్రవిడ్ హయాంలో కుల్‌దీప్‌ను ఒక అసలైన మ్యాచ్ విన్నర్‌గా చూస్తూ పూర్తి స్వేచ్ఛ, భరోసా ఇచ్చారని గుర్తు చేశాడు. ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం అదే బాటలో ఈ స్పిన్నర్ విషయంలో అలాంటి నిర్ణయాలే తీసుకోవాలని హితవు పలికాడు. కాగా రాహుల్ ద్రవిడ్ కోచింగ్ హయాంలో (2021 నవంబర్ నుంచి 2024 జూన్ వరకు) కుల్‌దీప్ అన్ని ఫార్మాట్లలో కలిపి నెలకు సగటున 2 మ్యాచ్‌ల చొప్పున 60 మ్యాచ్‌లు ఆడాడు. అయితే గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సగటు నెలకు 1.5 మ్యాచ్‌లకు (38 మ్యాచ్‌లు) పడిపోయింది. ముఖ్యంగా ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో కుల్‌దీప్‌ను కాదని నలుగురు పేసర్లతో బరిలోకి దిగడం అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కుల్‌దీప్ పట్ల ప్రస్తుత మేనేజ్‌మెంట్ వ్యవహరిస్తున్న తీరుపై సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా తన యూట్యూబ్ ఛానెల్‌లో బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గంభీర్ హయాంలో బౌలింగ్ పదును కంటే బ్యాటింగ్ డెప్త్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంపై మురళీ కార్తీక్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. టెస్టు మ్యాచ్ గెలవాలంటే ప్రత్యర్థి 20 వికెట్లు తీయడం అత్యంత కీలకమని వ్యాఖ్యానించాడు. కేవలం బ్యాటింగ్ డెప్త్ కోసం బౌలింగ్‌ను బలహీనపర్చకూడదని పేర్కొన్నాడు. కుల్‌దీప్ బ్యాట్‌తో ఏమీ అసమర్థుడు కాదని, నైట్‌వాచ్‌మన్‌గా ఎన్నోసార్లు ఎక్కువ సేపు క్రీజులో నిలబడిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశాడు. జడేజా, అశ్విన్ వలె భారీ హిట్టింగ్ చేయలేకపోయినా, ఒక ప్రామాణిక స్పిన్ బౌలర్‌గా ప్రపంచంలో ఎక్కడైనా వికెట్లు తీయగల సత్తా కుల్‌దీప్‌కు ఉందని కొనియాడాడు. తుది జట్టులో తన స్థానం ఖాయమనే భరోసా కల్పించినపుడే ఆటగాళ్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఈ సందర్భంగా మురళీ కార్తిక్ చెప్పుకొచ్చాడు.

# పోర్చుగల్ టీ20 జట్టు కెప్టెన్‌గా మోసెస్ హెన్రిక్స్



క్రికెట్ ప్రపంచంలో ఆస్ట్రేలియా తరపున సుదీర్ఘ కాలం పాటు ఆల్ రౌండర్‌గా సేవలందించిన మోసెస్ హెన్రిక్స్ తన కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమైన రెండో అధ్యాయాన్ని ప్రారంభించాడు. ఇన్నాళ్లు ఆస్ట్రేలియా తరపున క్రికెట్ ఆడిన అతడు.. ఇప్పుడు మరో దేశ జాతీయ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. ఈ మేరకు పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హెన్రిక్స్‌ను నియమిస్తూ పోర్చుగల్ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. అతడి సారథ్యంలోనే పోర్చుగల్ జట్టు 2028 టీ20 వరల్డ్ కప్ యూరప్ సబ్-రీజినల్ క్వాలిఫయర్ 'సి'లో తలపడనుంది. ఫిన్‌లాండ్ వేదికగా ఆగస్టు 14 నుంచి 21 వరకు ఈ టోర్నీ జరగనుంది. ఫుట్‌బాల్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో జన్మించిన పోర్చుగల్‌లోని 'మదీరా' దీవిలోనే హెన్రిక్స్ జన్మించాడు. చిన్నతనంలో కుటుంబంతో కలిసి ఆస్ట్రేలియాకు వలస వెళ్లాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరపున 4 టెస్టులు, 16 వన్డేలు, 24 టీ20 మ్యాచ్‌లు ఆడాడు మోసెస్ హెన్రిక్స్. న్యూ సౌత్ వేల్స్, బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ తరపున ఆడాడు. అంతేకాకుండా సిడ్నీ సిక్సర్స్ జట్టుకు వరుసగా 2019-20, 2020-21 సీజన్లలో కెప్టెన్‌గా టైటిళ్లు సాధించి పెట్టాడు. 2021లో బంగ్లాదేశ్‌తో ఆసీస్ తరపున తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. మూడేళ్ల కూలింగ్-ఆఫ్ పీరియడ్ పూర్తి చేసుకుని పోర్చుగల్ తరపున ఆడే అర్హత సాధించాడు. గత నెలలోనే ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన 39 ఏళ్ల హెన్రిక్స్, తన జన్మభూమి అయిన పోర్చుగల్‌కు ఆడాలనే నిర్ణయాన్ని వెల్లడించాడు. అయితే కేవలం ఆటగాడిగానే కాకుండా బోర్డు అతనికి ఏకంగా జట్టు నాయకత్వ పగ్గాలను అప్పగించింది. ఐసీసీ నిబంధనల ప్రకారం ఈ టోర్నీ ఫైనల్ గెలిచిన జట్టు యూరోపియన్ రీజినల్ క్వాలిఫయర్ రౌండ్‌కు చేరుకుంటుంది. అక్కడ స్కాట్లాండ్, జెర్సీ, డెన్మార్క్ వంటి బలమైన జట్లతో పోటీపడి టాప్-2లో నిలిస్తే గ్లోబల్ క్వాలిఫయర్ ద్వారా 2028లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వేదికలుగా జరగబోయే ప్రధాన టీ20 వరల్డ్ కప్‌నకు పోర్చుగల్ అర్హత సాధించవచ్చు. బిగ్‌బాష్ లీగ్, ఐపీఎల్, అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న మోసెస్ హెన్రిక్స్ సారథ్యంలో అసోసియేట్ దేశమైన పోర్చుగల్ క్రికెట్ ఎలాంటి ప్రదర్శన చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల

భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది.అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ



క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

# దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి

## ●భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్



దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని భారత దిగ్గజ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. దేశవాళీ క్రికెట్ ఆడని భారత ఆటగాళ్ల పట్ల బీసీసీఐ కఠినంగా వ్యవహరించాలని సూచించాడు. గత రెండేళ్లుగా స్పిన్ బౌలింగ్ ఎదుర్కోవడంలో టీమిండియా తడబడుతోంది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల సామర్థ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకనే టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్, సౌతాఫ్రికా చేతుల్లో క్లీన్ స్వీప్ అయ్యింది. అయితే టెస్టుల్లో టీమిండియా ఘోర వైఫల్యానికి స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఆడలేకపోవడమే ప్రధాన కారణమని కపిల్ దేవ్ అన్నాడు. అగ్రశ్రేణి ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉండటంతోనే స్పిన్ బౌలింగ్‌ను సరిగ్గా ఆడలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు. 'దేశవాళీ క్రికెట్ ఆడటం చాలా ముఖ్యం. టాప్ క్లాస్ ప్లేయర్లు తగినంతగా దేశవాళీ క్రికెట్ ఆడకపోవడం వల్లే భారత జట్లు స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయంలో బీసీసీఐ కఠినంగా వ్యవహరించి అందరూ దేశవాళీ రెడ్ బాల్ క్రికెట్ ఆడేలా చూడాలి. దాంతో టాప్ క్లాస్ ఆటగాళ్ల నుంచి ఎంతో నేర్చుకునే అవకాశం కుర్రాళ్లకు లభిస్తోంది. ఈ మధ్య భారత్ ఎక్కువగా టీ20లు, వన్డేలు ఆడుతోంది. టెస్ట్ క్రికెట్ పూర్తిగా భిన్నమైదని. ఈ సమస్యను అధిగమించడానికి ఒక పరిష్కార మార్గాన్ని కనుగొనాలి. టీ20 మ్యాచ్‌లు పెరిగినందున పేసర్లు గాయాల బారిన పడకుండా వారి వర్క్‌లోడ్‌పై బీసీసీఐ ఫోకస్ పెట్టాలి.'అని సూచించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027లో భాగంగా రెండు టెస్టుల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లింది. ఆగస్ట్ 15 నుంచి ఈ సిరీస్ మొదలవ్వనుంది. గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేయాలి.

# ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి హార్దిక్ పాండ్యా



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ హాట్ టాపిక్‌గా మారింది. హార్దిక్ ట్రేడింగ్ గురించి పూటకో వార్త తెరపైకి వస్తుంది. పేలవ ప్రదర్శన నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌ను వీడేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమవ్వగా.. అతన్ని తీసుకునేందుకు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు హార్దిక్ పాండ్యాను అడ్డుపెట్టుకొని తమకు కావాల్సిన ఆటగాళ్ల కోసం ఆయా ఫ్రాంచైజీలతో ముంబై ఇండియన్స్ సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోజుకో ఫ్రాంచైజీలో హార్దిక్ పాండ్యా చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.ముందుగా చెన్నై సూపర్ కింగ్స్‌తో హార్దిక్ పాండ్యా ట్రేడ్ డీల్స్ జరిపిన ముంబై ఇండియన్స్ ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్, కేకేఆర్‌తో చర్చలు జరిపినట్లు ప్రచారం జరిగింది. హార్దిక్ పాండ్యా తన పాత ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడని, అతన్ని తీసుకునేందుకు ఆఫ్రాంచైజీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ అడగడంతో అతని ట్రేడ్ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి చేరేందుకు హార్దిక్ పాండ్యా సిద్ధమయ్యాడని సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. ఎక్స్ వేదికగా హార్దిక్ పాండ్యా ఫొటోను ఢిల్లీ క్యాపిటల్స్ షేర్ చేయడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. గాయంతో భారత జట్టుకు దూరమైన హార్దిక్ పాండ్యా.. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సీఓఈలో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కష్టపడుతున్నాడు. అయితే ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ఆల్‌రౌండర్ మిన్ను మణి కూడా సీఓఈలోనే రిహాబిలిటేషన్ తీసుకుంటుంది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు

టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్



యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతే సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది.సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది.సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



# ఇక సినిమాల్లో అవకాశాలు రావనుకున్నా

## నటి సమంత

నటి సమంత 'మా ఇంటి బంగారం'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు. మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను' అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, 'ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

# అసభ్యకరమైన పోస్టులు తొలగించండి

## జాన్వీ కపూర్ పిటిషన్‌పై కోర్టు ఆదేశం

ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన పేరు, ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, ఎఐ ద్వారా సృష్టించిన డీప్‌ఫేక్ వీడియోలను ప్రచారం చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. అయితే ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనూప్ జైరామ్ భంభాని కీలక ఆదేశాలు జారీ చేశారు. అసభ్యకరంగా ఉన్న కంటెంట్‌ను, అలాగే ఎవరైనా ఆమె పేరును వాణిజ్యపరంగా దుర్వినియోగం చేస్తుంటే ఆ పోస్టులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. పర్సనాలిటీ రైట్స్ అనే భావనకు ఒక సరైన హద్దు ఉండాలని, సెలబ్రిటీల హక్కులను రక్షించడంతోపాటు భావప్రకటన స్వేచ్ఛను కూడా సమతుల్యం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్ని ఫ్యాన్ పేజీలపై ఒకేసారి నిషేధం విధించలేమని కోర్టు పేర్కొంది. కేవలం వాణిజ్య ప్రయోజనాల కోసం లేదా డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎవరైనా ఆమె పేరును వాడుకుంటేనే కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చునని, అయితే అన్ని ఫ్యాన్ పేజీలను నేరపూరితమైనవిగా పరిగణించలేమని తెలిపారు. కొందరు వ్యంగ్యంగా లేదా విమర్శనాత్మక ధోరణిలో కూడా పోస్టులు చేసే అవకాశం ఉందని న్యాయమూర్తి గుర్తుచేశారు. ఈ కేసులో మెటా తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తరఫున ఇప్పటికే 4,000కు పైగా యూఆర్ఎల్‌లను సమర్పించారని, అయితే ఆ కంటెంట్ అంతా ఒకేలా అభ్యంతరకరంగా లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో, ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటెంట్‌ను స్పష్టమైన వర్గాలుగా విభజించి తదుపరి విచారణకు కోర్టు ముందుంచాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని న్యాయమూర్తి ఆదేశించారు. గతంలో కూడా పలువురు ప్రముఖ నటీనటులు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.




# కిమ్స్ ఆసుపత్రిలో ఎన్టీఆర్‌కు విజయవంతంగా సర్జరీ పూర్తి

టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం నాడు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఆయన భుజానికి వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ సర్జరీని నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రస్తుతం ఆయన ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించాయి. ఇటీవల జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో వైద్యులు ఆయనకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే, గాయం నుంచి వేగంగా, పూర్తిగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సిఫార్సు చేయడంతో నేడు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స నుంచి ఎన్టీఆర్ పూర్తిగా కోలుకుని, తిరిగి తన వృత్తిపరమైన పనుల్లో నిమగ్నం కావడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్నారు.



# 4న వస్తోన్న క్రైమ్ థ్రిల్లర్ మిర్జాపూర్ మూవీ




భారతీయ ఓటీటీ చరిత్రలో సంచలనం సృష్టించడంతో పాటు అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించేందుకు సిద్ధమైంది. అమెజాన్ ఎమ్‌జీఎం స్టూడియోస్ మరియు ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి గుర్‌మీత్ సింగ్ దర్శకత్వం వహిస్తుండగా, సిరీస్‌లో అదరగొట్టిన ప్రధాన నటీనటులందరూ మళ్లీ పెద్ద తెరపై తమ విశ్వరూపం చూపించడానికి వస్తున్నారు. 'సింహాసనం అనేది రాజకీయాల ద్వారా రాదు, అలా అని వంశపారంపర్యంగానూ రాదు? కేవలం బాహుబలం ఉంటేనే సింహాసనం దక్కుతుంది అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ట్రైలర్ ఆకట్టుకుంటుంది. ఓటీటీలో వెబ్ సిరీస్‌గా ప్రేక్షకులను అలరించిన ఈ నేర ప్రపంచాన్ని, మరింత భారీ హంగులతో, అత్యున్నత నిర్మాణ విలువలతో వెండితెర కోసం మలిచారు. గతంలో సిరీస్‌లో మరణించినట్లు చూపించిన మున్నా భయ్యా (దివ్యేందు) పాత్ర ఈ చిత్రంలో మళ్లీ రీఎంట్రీ ఇస్తుండటం అభిమానులకు అసలైన విందుగా మారనుంది. ఇక మిర్జాపూర్ సింహాసనం కోసం జరిగే పోరులో కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డూ పండిట్ (అలీ ఫజల్) మరియు మున్నా భయ్యా మధ్య జరిగే రక్తపాతంతో కూడిన పోరాటం ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందులతో పాటు శ్వేతా త్రిపాఠి, రసికా దుగ్గల్, అభిషేక్ బెనర్జీ, జితేంద్ర కుమార్, రవి కిషన్ మరియు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# మరోసారి 'చిరు లీక్స్'...

## తన 158వ సినిమా టైటిల్ చెప్పేసిన మెగాస్టార్!



మెగాస్టార్ చిరంజీవి తన రాబోయే సినిమాకు సంబంధించిన కీలకమైన విషయాన్ని అనుకోకుండా బయటపెట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' సక్సెస్ మీట్‌లో తన 158వ సినిమా టైటిల్‌ను ఆయనే స్వయంగా లీక్ చేశారు. దీంతో చజష్ట్రఅతీబూమ్ఘుఎం అనే హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే.. కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో చిరంజీవి తన 158వ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి 'కదిరి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని చిరంజీవి సరదాగా వేదికపై వెల్లడించారు. ఈవెంట్‌లో లీక్‌ల గురించి ప్రస్తావన రాగా, సంగీత దర్శకుడు తమన్ వద్దని వారిస్తున్నా, "టీజర్ మ్యూజిక్ అయ్యిందా? చివర్లో 'కదిరి' అని టైటిల్ పెట్టారా?" అని చిరంజీవి అడగడంతో అసలు విషయం బయటపడింది. అంతేకాదు తన పుట్టినరోజు కానుకగా ఆగస్టు 22న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కూడా ప్రకటించారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి-బాబీ కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రంలో చిరంజీవి సరసన ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా, కన్నడ నటి రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కే నారాయణ, లోకేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

# ఇరుముడి ట్రైలర్ రిలీజ్..

మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు.. చివరిగా ఆయన నటించిన మాస్ జాతర, భర్త మహాశయులకు విజ్ఞప్తి ఈ రెండు చిత్రాలు కూడా ఆయనకు పెద్దగా విజయాన్ని అందించలేదు. దీంతో ఆయన ఖాతాలో హిట్ అనివార్యమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా మంచి సక్సెస్ అందుకోవాలని చూస్తున్న రవితేజ ఏకంగా జానర్ మార్చి 'ఇరుముడి' అనే టైటిల్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆగస్టు 21న ఈ సినిమా విడుదల కాబోతోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర బృందం అప్పుడే ప్రమోషనల్ కార్యక్రమాలు మొదలుపెట్టింది. పైగా సినిమా నుండి ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి రెస్పాండ్ లభించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. అయ్యప్ప మాలలో ప్రేక్షకులకు ఈసారి మంచి వినోదాన్ని పంచడానికి సిద్ధమైన రవితేజ.. ఈ ట్రైలర్ తో సినిమాపై అంచనాలు పెంచేశారు. తాజాగా విడుదల చేసిన ట్రైలర్లో భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ మేళవింపుగా దీనిని తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.




# గతంలో జరిగిన తప్పులకు క్షమించండి

## డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌లో జానీమాస్టర్

తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార వేడుకలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఫిల్మ్ ఛాంబర్, ఫెడరేషన్‌తో తలెత్తిన విభేదాలు మరియు వివాదాల పట్ల జానీ మాస్టర్ బహిరంగంగా క్షమాపణలు కోరారు. గత కాలపు పొరపాట్లను పక్కనపెట్టి మళ్లీ ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించుకున్నామని, కొంతకాలం అసోసియేషన్‌కు దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ అందరితో కలిసి పనిచేసేందుకు వచ్చానని ఆయన స్పష్టం చేశారు. ఇకపై అందరం ఒకే కుటుంబంలా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిర్మాతలు ఇచ్చే పారితోషికాలు డ్యాన్సర్లకు పూర్తిగా అందడం లేదనే తీవ్ర ఆవేదనతోనే గతంలో తాను మాట్లాడాల్సి వచ్చిందని ఆయన వెల్లడించారు. ఇదే అంశంపై మెగాస్టార్ చిరంజీవిని కలిసినప్పుడు, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో తన మాటల ద్వారా ఎవరికైనా మనస్తాపం కలిగి ఉంటే, లేదా తెలిసీ తెలియక ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పెద్ద మనసుతో క్షమించాలని ఇండస్ట్రీ పెద్దలను జానీ మాస్టర్ కోరారు. తండ్రి కోప్పడినా చివరికి పిల్లలను దగ్గరకు తీసుకున్నట్లే, సినీ పరిశ్రమ పెద్దలు మరియు నిర్మాతల మండలి డ్యాన్సర్ల అసోసియేషన్‌ను కలుపుకొని ఆదరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com